తెలంగాణ
TELANGANA MUCHATLU
# ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం - 03 - మార్చి - 2026 | సంపుటి : 3 | సంచిక : 274 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## ఇరాక్‌లా కాదు..
# త్వరలోనే యుద్ధం ముగిస్తాం
### అమెరికా రక్షణ మంత్రి



**న్యూఢిల్లీ, మార్చి 2, (తెలంగాణ ముచ్చట్లు ప్రతినిధి)**

ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులు మూడో రోజుకు చేరుకున్నాయి. ఇరాన్ కూడా ప్రతిదాడులకు పాల్పడుతుండడంతో పశ్చిమాసియా అంతటా ఉద్రిక్తత నెలకొంది ఈ నేపథ్యంలో అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఎయిర్‌ఫోర్స్ జనరల్ డాన్ కైన్‌తో కలిసి హెగ్సెత్ పెంటగాన్‌లో ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. యుద్ధం ప్రారంభమైన అనంతరం ట్రంప్ సర్కారు బ్రీఫింగ్ ఇవ్వడం ఇదే తొలిసారి. ''ఈ యుద్ధాన్ని మేం ప్రారంభించలేదు.

మిగతా 2లో..



# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు
## ఇరాన్ ప్రతీకార దాడులతో ఉద్రిక్తతలు తీవ్రం

**న్యూఢిల్లీ, మార్చి 2, (తెలంగాణ ముచ్చట్లు ప్రతినిధి)**

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త దాడులతో పశ్చిమాసియా అల్లకల్లోలంగా మారింది. తమ సుప్రీం లీడర్ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్) దాడులు చేపట్టింది. దీంతో పరిస్థితులు మరింత దిగజారాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై ఇరాన్ డ్రోన్ దాడికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో పొగ దట్టంగా అలముకుంది. అంబులెన్స్‌లు, అగ్నిమాపక యంత్రాలు అక్కడికి చేరుకున్నట్లు పలు అంతర్జాతీయ కథనాలు వెల్లడించాయి. మరోవైపు, ఇరాన్ డ్రోన్ దాడులతో బహ్రెయిన్ రాజధాని మనామాతో పాటు దుబాయ్, దోహా, అబుదాబిలోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్‌లోని ఎయిర్‌పోర్టు సమీపంలో రెండు డ్రోన్లను ఆ దేశ గగనతల రక్షణ వ్యవస్థలు కూల్చేశాయి. సైప్రస్‌లోని బ్రిటన్ నౌకాదళ స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడిలో స్వల్ప నష్టమే జరిగిందని సైప్రస్ ప్రభుత్వం వెల్లడించింది. ఇక, ఇజ్రాయెల్‌లో సైరన్ల మోత మోగుతోంది.

మిగతా 2లో..



## మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య తెలంగాణ పౌరులకు అండగా ప్రభుత్వం

- న్యూఢిల్లీలో 24 గంటల నియంత్రణ కేంద్రం ఏర్పాటు
- విదేశాంగ మంత్రిత్వ శాఖతో నిరంతర సమన్వయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**న్యూఢిల్లీ, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ పౌరుల భద్రత కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మిగతా 2లో..



## దుబాయ్‌లో చిక్కుకున్న తుమ్మల నాగేశ్వరరావు

- యుద్ధ వాతావరణంతో విమానాశ్రయం మూసివేత
- కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లి అక్కడే నిలిచిపోయిన మంత్రి
- సురక్షితంగానే ఉన్నానని తుమ్మల స్పందన

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):** పశ్చిమాసియాలో అనూహ్యంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. తన కుటుంబ సభ్యుల్లో ఒకరు అనారోగ్యానికి గురి కావడంతో వారిని పరామర్శించేందుకు ఐదు రోజుల క్రితమే దుబాయ్ వెళ్లిన ఆయన, ప్రస్తుతం అక్కడి పరిస్థితుల కారణంగా స్వదేశానికి తిరిగి రాలేకపోతున్నారు.

మిగతా 2లో..

## కేంద్రంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి..
# రాహుల్ పీఎం కావాలి
### రాహుల్‌ను పీఎం పీఠంపై కూర్చోబెట్టడమే కాంగ్రెస్ తదుపరి లక్ష్యమని రేవంత్ పిలుపు

- జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి 19 ఏళ్ల రాజకీయ ప్రస్థానం గుర్తుచేసుకున్న రేవంత్
- ప్రజల సమస్యలపై పోరాటమే తన ఎదుగుదలకు కారణమని స్పష్టం
- కేసులు, పరువు నష్టం దావాలు ఎదురైనా వెనుకడుగు వేయబోనని ధీమా
- తెలంగాణలో కాంగ్రెస్ అధికారానికి సోనియా గాంధీపై ప్రజా నమ్మకమే ప్రధాన కారణమని వ్యాఖ్య

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే మన లక్ష్యం కావాలంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం.. రాహుల్ గాంధీ పీఎం కావాలని ఆకాంక్షించారు. గత కొన్నేళ్లుగా రాహుల్ గాంధీ చేస్తున్న నిరంతర పోరాటాలే.. ప్రస్తుతం ఆయనను ప్రతిపక్ష నేతను చేశాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సాధారణ జడ్పీటీసీ నుంచి ముఖ్యమంత్రి వరకు ఎదిగిన తన రాజకీయ ప్రస్థానం గురించి కూడా ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి వెల్లడించారు.

మిగతా 2లో..





## ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి

- కవిత
- పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ డిమాండ్
- అసెంబ్లీలో తీర్మానం చేయాలని విజ్ఞప్తి
- ఉపకులాల సమస్యలపై జాగృతి ఉద్యమం

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్రంలో ఎస్సీల జనాభా 15 శాతం నుంచి 18 శాతానికి పెరిగినట్లు గతంలో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేతో పాటు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల గణనలో స్పష్టమైందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఎస్సీ ఉపకులాల నాయకులతో సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో..

## మూటల కోసమే తెలంగాణకొచ్చారు..
# రాహుల్‌పై బండి సంజయ్ ఫైర్

- శిక్షణ తరగతులు కాకుండా బాన్సువాడ పర్యటన చేయాలని సలహా
- బాన్సువాడ ఘర్షణల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిలన బండి
- మూసీ పరిధిలో పేదల ఇండ్లు కూల్చి పెద్దలతో బేరాలంటూ విమర్శ
- అమెరికా ట్రేడ్ డీల్‌పై రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్

**నిజామాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):**

రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రానికి వచ్చేది మూటల కోసమే అని కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ శిక్షణ తరగతులకు కాకుండా.. బాన్సువాడలో పర్యటించండి అంటూ సలహా ఇచ్చారు. సోమవారం బండి సంజయ్ కామారెడ్డిలో పర్యటించి, బాన్సువాడలో రెండు వర్గాల గొడవలకు సంబంధించిన బాధిత కుటుంబాలను పరామర్శించారు.



మిగతా 2లో..

## రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యంగ్య పోస్టు
### వెయ్యి కోట్ల వ్యాఖ్యలపై రాజకీయ దుమారం
### "ఏఐసీసీ ఏటీఎం తెలంగాణ" అంటూ వ్యాఖ్య
### ఆరు హామీల అమలుపై సమీక్ష కోరిన కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):**

లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీను ఉద్దేశిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు తన అధికారిక సామాజిక మాధ్యమ ఖాతాలో వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు ఇస్తానని ఇటీవల ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ పోస్టు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.



మిగతా 2లో..

## హోలీ ప్రశాంతంగా జరుపుకోండి: సజ్జనర్
### విజిబుల్ పోలీసింగ్‌కు ఆదేశాలు.. బలవంతపు రంగులకు కఠిన చర్యలు
### ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాల మూసివేత

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):**

నగరంలో హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి సీ సజ్జనర్ సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బంజారాహిల్స్‌లోని టీజీఐసీసీసీ నుంచి సోమవారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పండుగ రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.




మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను తమ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ అడ్డుకుంటోందని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ వెల్లడించాయి. ఈసందర్భంగా యుద్ధం ఆపేందుకు మధ్యవర్తులతో ఇరాన్ సంప్రదింపులు జరుపుతోందంటూ వస్తోన్న వార్తలను ఇరాన్ నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి అలీ లరిజానీ ఖండించారు. యుద్ధం విషయంలో అమెరికా (USA)తో చర్చలు జరిపే ప్రసక్తే లేదని 'ఎక్స్' వేదికగా స్పష్టంచేశారు. ''ఈ దాడులను మేం మొదలుపెట్టలేదు. ట్రంప్ తన తప్పుడు ఆకాంక్షలతో ఈ ప్రాంతాన్ని సంక్షోభంలోకి నెట్టేశారు. ఇజ్రాయెల్ అధికార కాంక్ష కోసం అమెరికా సైనికులను బలి చేస్తున్నారు'' అని అలీ లరిజానీ ఆగ్రహం వ్యక్తంచేశారు.



## కేంద్రంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి..

# రాహుల్ పీఎం కావాలి

(మొదటి పేజీ తరువాయి)

వికారాబాద్ జిల్లా అనంతగిరిలో కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈ సమావేశాల ముగింపు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ భవిష్యత్ కోసం.. దేశ ప్రజల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. దేశం కోసం.. అందరి కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని ఆకాంక్షించారు.

గత 5 ఏళ్లుగా రాహుల్ గాంధీ చేసిన నిరంతర పోరాటాల ఫలితంగానే.. ఇప్పుడు ఆయన లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎదిగారని గుర్తు చేశారు. దేశంలో నెలకొన్న అనేక సమస్యలపై రాహుల్ గాంధీ నిత్యం అలుపెరగని పోరాటం చేస్తున్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రి పీఠంపై కూర్చోబెట్టడమే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల తదుపరి లక్ష్యం కావాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే తన రాజకీయ ప్రస్థానానికి సంబంధించి రేవంత్ రెడ్డి కీలక విషయాలను వెల్లడించారు. ఒక సామాన్య జడ్పీటీసీ స్థాయి నుంచి తాను ఇప్పుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానని తన రాజకీయ ప్రయాణాన్ని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. గత 19 ఏళ్ల కాలంలోనే జడ్పీటీసీ నుంచి సీఎం స్థాయికి ఎదిగినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా, పార్టీలో రకరకాల పదవులు, బాధ్యతలను స్వీకరించి చాలా అనుభవాన్ని సంపాదించినట్లు వెల్లడించారు. తన రాజకీయ జీవితంలో ఎన్నడూ పైరవీలకు తావు లేదని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి.. కేవలం ప్రజల సమస్యల పైనే గళం వినిపించడమే తన ప్రధాన పనిగా పెట్టుకుని.. ఈ స్థాయికి వచ్చినట్లు వివరించారు.

ప్రజల కోసం పోరాటం చేసి.. వారి పక్షాన నిలబడినందుకు తనపై ఎన్నో కేసులు నమోదు చేసినట్లు సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. కేసులు మాత్రమే కాకుండా.. పరువు నష్టం దావాలు కూడా వేశారని తెలిపారు. నిన్న కూడా తాను ఓ కేసులో కోర్టుకు హాజరైనట్లు తెలిపిన రేవంత్ రెడ్డి.. అయినప్పటికీ వెనకడుగు వేసే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు సోనియా గాంధీపై ఉన్న ప్రజలకు ఉన్న నమ్మకమే ప్రధాన కారణమని ఈ సందర్భంగా వెల్లడించారు.

సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం కైవసం చేసుకున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తితో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి.. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని హస్తం పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడమే మన మార్గమని.. రాహుల్ గాంధీని పీఎం చేయడమే మన గమ్యమని వ్యాఖ్యానించారు.

## రాహుల్ గాంధీపై కేటీఆర్ వ్యంగ్య పోస్టు

(మొదటి పేజీ తరువాయి)

తన పోస్టులో "హలో రాహుల్ గాంధీ.. ఏఐసీసీ ఏటీఎం అయిన తెలంగాణకు స్వాగతం" అంటూ వ్యాఖ్యానించిన కేటీఆర్, "మీరు ఇప్పుడు సీఎం దగ్గర వెయ్యి కోట్లు వసూలు చేసుకోవడానికి వచ్చారా?" అని వ్యంగ్యంగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధానికి దారితీశాయి. ఇంకా 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన ఆరు హామీలు, అలాగే ఇతర ఎన్నికల వాగ్దానాల పురోగతిపై కూడా సమీక్ష చేయాలని కేటీఆర్ సూచించారు. రాష్ట్రంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. ఈ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వాగ్వాదం చెలరేగింది.

## హోలీ ప్రశాంతంగా జరుపుకోండి: సజ్జనర్

(మొదటి పేజీ తరువాయి)

బ్లూ కోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరం గస్తీ కాయాలని చెప్పారు. ఇష్టం లేని వారిపై బలవంతంగా రంగులు పూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పాదచారులు, వాహనాలపై రంగులు చల్లవద్దని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై నగరవ్యాప్తంగా మఫ్టీలో షీ టీమ్స్ నిఘా ఉంటుందని తెలిపారు. ప్రజలు రసాయన రంగులకు బదులు సహజసిద్ధమైన రంగులు వాడాలని సూచించారు. వేడుకల్లో డీజేలకు ఎలాంటి అనుమతి లేదని పేర్కొన్నారు. రోడ్లపై యువకులు గుంపులుగా తిరుగుతూ న్యూసెన్స్ చేస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. రంజాన్ మాసం నేపథ్యంలో ముస్లింల ప్రార్థనలకు ఆటంకం కలగకుండా చూడాలని, పీస్ కమిటీల సమన్వయంతో పోలీసులు పనిచేయాలని ఆదేశించారు.

హోలీ సందర్భంగా హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లపై ఆంక్షలు విధించినట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సిటీ పోలీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తితే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని, పోలీసులకు సహకరించి పండుగను సంతోషంగా జరుపుకోవాలని నగర ప్రజలను కోరారు.



# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ఉద్యమ హెచ్చరిక

- పీఆర్సీ, డీఏ, లీవ్ ఎన్‌కాష్‌మెంట్ తక్షణ చెల్లింపు డిమాండ్
- రాష్ట్ర ఆర్థిక వ్యవహారాలపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
- బకాయిలు చెల్లించకపోతే భారీ ఉద్యమానికి సిద్ధమని హెచ్చరిక
- ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. రిటైర్మెంట్ ప్రయోజనాల కోసం వృద్ధులు, ఉద్యోగులు రోడ్లపైకి రావాల్సి రావడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు.

పీఆర్సీ 2020 బకాయిలను వెంటనే చెల్లించాలని, డీఏ బకాయిలను వాయిదాలుగా కాకుండా ఏకమొత్తంగా ఇవ్వాలని, లీవ్ ఎన్‌కాష్‌మెంట్‌ను ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 మార్చి నుంచి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. జీపీఎఫ్, జీఐఎస్ నిధులను వడ్డీతో సహా చెల్లించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో జెండాలతో సంబంధం లేకుండా అందరూ కలిసి పోరాడినట్లే, ఈ రోజు కూడా పార్టీ జెండాలు పక్కన పెట్టి ఉద్యోగుల కోసం ఒక్కటిగా నిలబడాల్సిన సమయం వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ, మాటలు గొప్పగా ఉన్నా అమలు మాత్రం కనిపించడం లేదన్నారు. ఆర్థిక శాఖలో నిర్ణయాలు పైస్థాయిలోనే నిలిచిపోతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్‌లో అదనపు ఖర్చులపై ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూముల విక్రయాలు, ఆర్థిక వనరుల వినియోగంపై పారదర్శకత అవసరమన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, విశ్రాంత ఉద్యోగులను సంఘటితం చేసి పోరాటానికి సిద్ధమవుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి ఇదొక హెచ్చరిక మాత్రమేనని, బకాయిల చెల్లింపులో తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, వివిధ మోర్చాల రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ మరియు రాష్ట్ర స్థాయి సీనియర్ నాయకులు, జిల్లా అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూటల కోసమే తెలంగాణకొచ్చారు..

# రాహుల్‌పై సంజయ్ ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నేతలు బయట కూడా తిరగలేరని వార్నింగ్ ఇచ్చారు. ఒవైసీ కళ్లల్లో ఆనందం కోసమే బాన్సువాడలో హిందువులను జైల్లో వేశారని ఆరోపించారు. రోడ్డుపై నిలబడ్డ నాయకులపై కూడా కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూసీ పరిధిలో పేదల ఇండ్లను కూల్చి పెద్దలతో బేరాలాడుతున్నారని బండి విమర్శించారు. గాంధీ విగ్రహం పేరుతో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమని, గాంధీ ఆత్మ క్షోభిస్తదని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం గుజరాత్‌లో పటేల్ విగ్రహం నిర్మించి ప్రజల మనసులను దోచుకుందని గుర్తుచేశారు. అమెరికాతో ట్రేడ్ డీల్ వల్ల ఏ దేశంతో యుద్ధం వస్తుందో రాహుల్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లోనే అంతర్యుద్ధం మొదలైన సంగతి రాహుల్ గుర్తుంచుకోవాలని బండి సంజయ్ చురకలంటించారు.

బఫర్ జోన్, ఎఫ్ టీఎల్ పేరుతో పేదల ఇండ్లు కూలిస్తే, అదే ప్రాంతంలోని పెద్దల ఇండ్లను బుల్డోజర్లతో తాము కూల్చివేస్తామని బండి హెచ్చరించారు. ఒవైసీ అక్రమంగా నిర్మించిన ఫాతిమా కాలేజీ కూల్చడానికి పరీక్షలు అడ్డు వస్తే.. ఖమ్మంలో ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల భవిష్యత్తు గుర్తుకురాలేదా? అని ప్రశ్నించారు. పేదలకు ఒక న్యాయం.. ఒవైసీ కాలేజీకి మరో న్యాయమా? అని ప్రశ్నించారు. ఇంకెన్నాళ్లు కాంగ్రెస్, మజ్లిస్ అరాచకాలను భరించాలని ప్రశ్నించాలని, బీజేపీ కార్యకర్తల ఓపికను చేతగానితనంగా భావిస్తే గుణపాఠం తప్పదని బండి సంజయ్ వార్నింగ్ ఇచ్చారు.

## ఇరాక్‌లా కాదు..

# త్వరలోనే యుద్ధం ముగిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

కానీ ట్రంప్ నాయకత్వంలో దీన్ని ముగిస్తాం. దాదాపు 47 ఏళ్లుగా అమెరికాపై ఇరాన్ పరోక్ష యుద్ధం చేస్తోంది. ఆ దేశం అన్ని హద్దులూ దాటేసింది. అందుకే శిక్షిస్తున్నాం. ఇరాన్ క్షిపణి వ్యవస్థలను, నౌకా దళాన్ని పూర్తిగా ధ్వంసం చేయడమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చేయడమే మా లక్ష్యం. ఇరాన్‌పై జరుగుతున్న ఈ దాడులు ఇరాక్ యుద్ధంలాగా ఏళ్ల తరబడి సాగేది కాదు. ఇదో నిర్ణయాత్మకమైన మిషన్'' అని హెగ్సెత్ పేర్కొన్నారు.

పొరుగుదేశాల్లో ప్రజలపై దాడుల ద్వారా ఇరాన్ నిజస్వరూపం బయటపడిందని, విమానాశ్రయాలు, హోటళ్లు, భవనాలపై దాడులు చేసిందన్నారు. అణు కార్యక్రమాన్ని ఆపేయాలని గతంలోనే ఇరాన్‌ను హెచ్చరించామని, ఆ దేశం మాత్రం అహంకారంతో ఆ ప్రతిపాదనను తిరస్కరించిందని చెప్పారు. మరింత రెచ్చగొడుతూ అణు కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిందన్నారు. ఇది ప్రభుత్వ మార్పు కోసం చేస్తున్న యుద్ధం కాదని, కానీ ఈ అవకాశాన్ని ఇరాన్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అమెరికన్లను ఎక్కడైనా బెదిరించినా లేదా చంపినా వేటాడి మరీ అంతం చేస్తామని హెచ్చరించారు.

## మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య తెలంగాణ పౌరులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్, గల్ఫ్ తదితర ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ వాసుల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ భవన్‌లోని సీనియర్ అధికారులు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ఆయా దేశాల్లో చిక్కుకున్న తెలంగాణ పౌరులు, అలాగే వారి కుటుంబ సభ్యుల నుంచి వస్తున్న సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తూ అవసరమైన సహాయ చర్యలకు సమన్వయం చేస్తున్నారు. ప్రస్తుతం ఇరాన్, గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా తెలంగాణలో ఉన్న వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు, ప్రయాణ అంతరాయాలు, అత్యవసర పరిస్థితులు ఎదుర్కొన్నా న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న నియంత్రణ కేంద్రాన్ని సంప్రదించవచ్చని ప్రభుత్వం వెల్లడించింది. ఈ కేంద్రం ద్వారా అవసరమైన సమాచారం, మార్గదర్శకాలు, సహాయ సహకారాలు అందించబడతాయని పేర్కొన్నారు. నియంత్రణ కేంద్రానికి సంప్రదించాల్సిన ఫోన్ సంఖ్యలు ఇలా ఉన్నాయి: శ్రీమతి వందన బరువా - 9871999044, శ్రీ సీహెచ్ చక్రవర్తి - 9958322143, శ్రీ జావేద్ హుస్సేన్ - 9910014749, శ్రీ రక్షిత్ నాయక్ - 9643723157. మధ్యప్రాచ్య ప్రాంత పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తూ, కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

## దుబాయ్‌లో చిక్కుకున్న తుమ్మల నాగేశ్వరరావు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ క్షిపణి దాడుల లక్ష్యాన్ని యూఏఈ, కువైట్, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాల వైపు మళ్లించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు సమాచారం. అన్ని విమాన సర్వీసులను రద్దు చేయడంతో అక్కడి జనజీవనం తీవ్ర ప్రభావానికి లోనైంది విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన సురక్షితంగానే ఉన్నప్పటికీ, విమానాశ్రయ అధికారులు అనుమతి ఇచ్చే వరకు భారత్‌కు తిరిగి రావడం సాధ్యం కాదని తెలుస్తోంది. విమాన సర్వీసులు పునఃప్రారంభమైన వెంటనే హైదరాబాద్‌కు బయల్దేరుతానని ఆయన తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం.

## ఎస్సీ రిజర్వేషన్లు 18 శాతానికి పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

పెరిగిన జనాభాకు అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని కవిత డిమాండ్ చేశారు. ఇందుకోసం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని ఆమె కోరారు. ఎస్సీ వర్గీకరణ అమలు ప్రక్రియలో భాగంగా కేంద్రం చేపట్టే జనగణన పూర్తై అధికారిక లెక్కలు వెలువడిన తర్వాత రిజర్వేషన్ల పెంపు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిందని గుర్తు చేశారు. దానికి అనుగుణంగా రిజర్వేషన్ల పెంపు అంశంపై అసెంబ్లీలో స్పష్టమైన తీర్మానం ఆమోదించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎస్సీ ఉపకులాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ తగిన ప్రాతినిధ్యం దక్కాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర అభివృద్ధి కోసం ఉపకులాల వారీగా సమస్యలను గుర్తించి పరిష్కరించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ఎస్సీ ఉపకులాలతో కలిసి రిజర్వేషన్ల పెంపు సహా వారి సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ జాగృతి ఉద్యమిస్తుందని కవిత తెలిపారు. ముఖ్యంగా కొన్ని ఉపకులాలకు కుల ధృవీకరణ పత్రాల జారీ విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో 20 ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇరాన్ క్షిపణి దాడుల లక్ష్యాన్ని యూఏఈ, కువైట్, ఖతార్ వంటి దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలు, విమానాశ్రయాల వైపు మళ్లించడంతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. భద్రతా కారణాల దృష్ట్యా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసినట్లు సమాచారం. అన్ని విమాన సర్వీసులను రద్దు చేయడంతో అక్కడి జనజీవనం తీవ్ర ప్రభావానికి లోనైంది విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో తుమ్మల నాగేశ్వరరావు తన కుటుంబంతో కలిసి అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయన సురక్షితంగానే ఉన్నప్పటికీ, విమానాశ్రయ అధికారులు అనుమతి ఇచ్చే వరకు భారత్‌కు తిరిగి రావడం సాధ్యం కాదని తెలుస్తోంది. విమాన సర్వీసులు పునఃప్రారంభమైన వెంటనే హైదరాబాద్‌కు బయల్దేరుతానని ఆయన తెలిపారు. ఈ పరిణామాల నేపథ్యంలో గల్ఫ్ దేశాల్లో ఉన్న తెలుగు ప్రజల భద్రతపై కూడా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం.



## స్మార్ట్ కిడ్జ్ లో ఆనందోత్సవాలతో హోలీ సంబురాలు

- రంగులు పూసుకుంటూ హోలీ వేడుకలలో విద్యార్థుల ఎంజాయ్.

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)

స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో సోమవారం ముందస్తు హోలీ సంబరాలు ఆనందోత్సవాలతో జరిగాయి. పాఠశాలలోని వివిధ తరగతుల విద్యార్థులు ఒకరికొకరు సాంప్రదాయ రంగులు పూసుకొని రంగుల పండుగ లో ఎంజాయ్ చేశారు. తరతరాలుగా వస్తున్న హోలీ రంగుల వేడుకలలో చిన్నారులు పాఠశాలలో ఈ సంవత్సరం కూడా సంప్రదాయాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి మన భారతీయుల సంస్కృతి సాంప్రదాయాలలో రంగుల కేళి హోలీ పర్వదినానికి ప్రత్యేక స్థానం ఉందని తెలియజేశారు. అలనాడు బృందావనంలో శ్రీకృష్ణుడు గోపికలతో కలిసి రంగుల సంబరాలు నిర్వహించిన సాంప్రదాయాన్ని ప్రతి ఏటా సాంప్రదాయంగా జరుపుకుంటున్నారు అని తెలిపారు. ఈ హోలీ సంబరాల లో రసాయనిక రంగులను వాడడం ఆరోగ్యానికి హానికరమని, అందుకే సాంప్రదాయ మరియు సహజ రంగులను హోలీ వేడుకలలో ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## డాక్టర్ కాపా చంద్రకళను సన్మానించిన లయన్స్ క్లబ్ జిల్లా 320ఈ గవర్నర్..

- వైరా క్లబ్ నుండి ఆరుగురు గా కౌన్సిలర్లుగా గెలవడం అభినందనీయం..
- పిఎంజె ఎం మదన్మోహన్ రేపాల

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)

ఇంటర్నేషనల్ లయన్స్ క్లబ్ డిస్టిక్ 320 ఈ గవర్నర్ మదన్మోహన్ రేపాల ఆధ్వర్యంలో ఆదివారంరాత్రి వైరాలోని మున్సిపాలిటీ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ను శాలువాతో ఘనంగాసత్కరించారు.ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ గవర్నర్ మదన్ రేపాల మాట్లాడుతూ పట్టణ ప్రజలు కౌన్సిలర్లు సహకారాలతో పట్టణ సమస్యలు పరిష్కరించడం పాటు మౌలిక వసతులు కల్పించాలని పట్టణాన్ని సుందరీ కారణంగా తీర్చిదిద్ది ప్రజల్లో మంచి పేరు తీసుకు రావాలని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఆరుగురు గెలుపొందటం పట్ల అభినందించారు ప్రజలకు సేవనందించడంలోని సంతృప్తి ద్వారా ప్రజల మనల్ని పొందుగలుగుతామని ఈ మున్సిపల్ ఎన్నికలు వైరాలో నిరూపించాయని ఆయన తెలిపారు జిల్లా 320లో లయన్స్ సభ్యులు నలుగురు మున్సిపల్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు ఈ కార్యక్రమంలో 20 వార్డు కౌన్సిలర్ ఉండ్రు వరలక్ష్మి మున్సిపల్ వార్డులో అత్యధిక మెజార్టీతో గెలుపొందడం అభినందించతగ్గ విషయమని ఆయన తెలిపారు. వరలక్ష్మిశ్యాంబాబు, దంపతులను ఆయన ఈ సందర్భంగా అభినందించి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో లయన్ లేడీ విజయలక్ష్మి విడిజీ వన్ లయన్ , కేవీ ప్రసాద్, విడిజీ టు కోడె సతీష్ కుమార్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు యానాల మోహన్ రెడ్డి యరాల ప్రభాకర్ రెడ్డి డిసిఎస్ రామకృష్ణ చిలుకూరి, డిసిటి అశోక్ రెడ్డి గట్టుపల్లి, డిస్ట్రిక్ట్ మార్కెటింగ్ కోఆర్డినేటర్ లగడపాటి ప్రభాకర్ రావు జిల్లా నాయకులు శ్రీకాంత్ తోటకూర తదితరులు పాల్గొన్నారు.

## పేదల గుడిసెల కూల్చివేత అమానుషం

- మాజీ ఎంపీ నామ

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)



ఖమ్మం నగర కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూములల్లో నివసిస్తున్న వందలాది పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఆక్షేపించారు. ఏళ్ల తరబడి అక్కడ నివసిస్తూ జీవనోపాధి సాగిస్తున్న పేద కుటుంబాలకు ముందస్తుగా ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా గుడిసెలను కూల్చివేసి వారిని రోడ్డున పడవేయడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని నామ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులు చేసి, చెమటోడ్చి కట్టుకున్న పేదల ఇళ్లను క్షణాల్లో నేలమట్టం చేయడం పేదల గుండెలను పగలగొట్టే చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ కూల్చివేత సమయంలో మీడియాను కూడా రానివ్వకుండా అడ్డుకోవడం, పారదర్శకత లేకుండా చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పేదలపై ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ప్రభుత్వానికి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. భూదాన్ భూములల్లో నివసిస్తున్న వారి వివరాలు సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు లేదా స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిలబడుతుందని, వారి హక్కుల కోసం పోరాడతామని నామ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో అభివృద్ధి అవసరం ఉన్నప్పటికీ, అది పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేసేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# వెలుగుమట్ల లో అర్హులైన పేదలకు ఇళ్లు ఇస్తాం

- అభివృద్ధి కి మారుపేరు తుమ్మల
- ప్రతిపక్షాలు తుమ్మల పై బురద చల్లే ప్రయత్నం చేయడం తగదు
- ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టినా ప్రతిపక్షాల తీరు మారలేదు
- విలేకరుల సమావేశంలో మాజీ కార్పొరేటర్ వడ్డవే నరసింహారావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాధా కిషోర్ ,జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి

ఖమ్మం బ్యూరో, మార్చి2 (తెలంగాణ ముచ్చట్లు)




జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్. వెలుగుమట్లలోని భూదాన్ భూములలో ఇల్లు కోల్పోయిన అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నరసింహారావు ,ఖమ్మం అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధా కిషోర్ జిల్లా కాంగ్రెస్ నాయకులు సాదు రమేష్ రెడ్డి పేర్కొన్నారు సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అభివృద్ధి ప్రధాత అయిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అభివృద్ధి అంటేనే తుమ్మలన్నీ గుర్తు చేశారు. మచ్చలేని నాయకుడుగా తుమ్మల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ప్రతిపక్షాలు ఆవాకుల చావాకుల పేలితే సహించేది లేదన్నారు. వెలుగుమట్ల లోని భూదాన్ భూములలో అక్రమార్కులు దళారులు పేదవారి దగ్గర డబ్బులు తీసుకొని అక్రమంగా ప్లాట్లు కట్టబెట్టారని దళారులు సొమ్ము చేసుకున్నారని అన్నారు. అర్హులైన పేదలకు న్యాయం చేకూర్చాలని ప్రభుత్వం భావిస్తుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 1983 నుంచి రాజకీయాలలో మచ్చలేని నాయకునిగా ఎదిగారని ఈ రాజకీయ పార్టీలో ఉన్న నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని గుర్తు చేశారు. నాడు కేటీఆర్ , వడ అజయ్ కుమార్ మంత్రుల ఉండి భూదాన్ భూముల్లో నిరుపేదలకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తులు ప్రజల ఆస్తులు కాపాడడం ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేటీఆర్ కమ్మ వచ్చి రోడ్ షో చేసి వెళ్లారని విమర్శించారు. రెవెన్యూ అధికారుల ద్వారా సర్వే చేయించి అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వీరితో పాటు మాజీ కౌన్సిలర్ బెడద సత్యనారాయణ, దొడ్డా అశోక్, తాళ్లూరి హనుమంతరావు, జిల్లా మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్ లు పాల్గొన్నారు.

# కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాల్లో పాల్గొన్న ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)

కరుణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలకు ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనల అనంతరం పాల్గొన్నారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు.
వేడుకల్లో కార్డినల్ పూల అంతోని, ఖమ్మం మతపీఠాధిపతి సగిలి ప్రకాష్ లను ఎంపీ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ మతానికి ప్రపంచవ్యాప్తంగా విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతి చిన్న స్వతంత్ర దేశమైన వాటికన్ సిటీ క్రైస్తవ మతానికి ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తోందన్నారు. ప్రపంచ కాథలిక్ విశ్వాసులను ఏకతాటిపైకి తెచ్చే కేంద్రంగా వాటికన్ నిలుస్తోందని, శాంతి, ప్రేమ, సేవా భావాలే క్రైస్తవ మత ప్రధాన సందేశమని వివరించారు. కరుణగిరి పుణ్యక్షేత్రం కూడా ఆ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రతిబింబంగా జిల్లాలో విశ్వాసులను ఆకర్షిస్తోందని ఎంపీ అన్నారు. మన తెలుగు వ్యక్తి పూల అంతోనీకి కార్డినల్ గా అవకాశం రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ.. ఆయనను సత్కరించారు. అనంతరం క్రైస్తవ మత పెద్దలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ




కార్యక్రమంలో..ఏదులాపురం మున్సిపల్ చైర్పర్సన్ పోకబత్తిని అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మార్కెట్ చైర్మన్ హరినాధ బాబు, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, కౌన్సిలర్లు ఏనుగు స్వర్ణ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# బిసి సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా పంతంగి మారుతీ నియామకం

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బత్తిని మధు గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె వి కృష్ణారావు పాల్గొని బిసి జాతి బిడ్డలకు జరుగుతున్న అన్యాయాలను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది . వారిచే బీసీ సంక్షేమ సంఘం సత్తుపల్లి నియోజకవర్గం అధ్యక్షులుగా పంతంగి మారుతీ కి నియామక పత్రం అందించడం జరిగింది . మారుతీ ఆధ్వర్యంలో సత్తుపల్లి నియోజకవర్గ నుంచి బిసి సంక్షేమ సంఘం లో కొంత మంది నాయకులు చేరడం జరిగింది . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు యాదవ్ , జిల్లా గౌరవ సలహాదారులు పద్మాచారి , జిల్లా ఉపాధ్యక్షులు పార్థసారథి జిల్లా కార్యదర్శి మక్కాల వెంకన్న , యువజన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గునిగంటి వీరన్న , యువజన సంఘం ప్రధాన కార్యదర్శి చిన్నంశెట్టి రామకృష్ణ , బిసి ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్లూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు .



## ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులను సన్మానించిన పోలీస్ కమిషనర్



ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)

ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారులకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ .. సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలందించారని పోలీస్ కమీషనర్ కొనియాడారు. విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన వారు వి. చంద్రశేఖర రావు (ఎస్సై) యం. రామ్ లింగారెడ్డి (ఎస్సై ) జీ. డానియల్ ప్రభుదాస్ (ఎస్సై )ఈ కార్యక్రమంలో ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ..

ఖమ్మం బ్యూరో, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు)




చింతకాని మండలం అనంతసాగర్ గ్రామంలో అనంతసాగర్ యంగ్ వారియర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల పబ్లిక్ పరీక్షల కోసం అవసరమైన పరీక్ష సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నారపోగు వీరభద్రం, వేర్పుల రామకృష్ణ, దుమాల రామారావు మరియు ఎస్ వి ఎన్ పవన్ ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమం ఈరోజు అనంతసాగర్ గ్రామ ప్రైమరీ స్కూల్లో జరిగింది.ఈ సందర్భంగా విద్యార్థులకు పాడ్లు, పెన్నులు, స్కేలు, పెన్సిళ్లు పంపిణీ చేయడంతో పాటు పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలనే అంశాలపై అవగాహన కల్పించారు.
కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడ ప్రమీల పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. అలాగే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు మద్రి భాస్కర్ ( ఎస్.ఏ తెలుగు), ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్ వి ఎన్ పవన్ (ఎస్ ఏ భౌతిక శాస్త్రం), జానపాటి ఉపేందర్ (ఎస్ ఏ సోషల్ స్టడీస్) పాల్గొని విద్యార్థులకు పరీక్షలపై సూచనలు అందించారు. యూత్ అసోసియేషన్ సభ్యులు కన్నెగంటి వీరయ్య, వేర్పుల సైదులు, గడ్డం శ్రవణ్ కుమార్, వేర్పుల ఉపేందర్, నారపోగు వీరభద్రం తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# పర్యావరణానికి అనుకూలంగా హోలీ వేడుకలు జరుపుకుందాం



**వనపర్తి,మార్చి2(తెలంగాణ ముచ్చట్లు):**

భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన హోలీ పండుగను ఈసారి పర్యావరణానికి అనుకూలంగా, సురక్షితంగా జరుపుకోవాలని సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు. వసంత ఋతువు ఆగమనాన్ని సూచించే రంగుల పండుగ హోలీ, చెడుపై మంచి విజయానికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.హోలీ పండుగ వెనుక ఉన్న పౌరాణిక గాథల్లో ప్రముఖమైనది ప్రహ్లాదుడు-హోలిక దహనం కథ. హిరణ్యకశిపుడు తనను దేవుడిగా భావించి, విష్ణుభక్తుడైన తన కుమారుడు ప్రహ్లాదుడిని హింసించాడని పురాణాలు చెబుతున్నాయి. అగ్నిలో కాలకూడదనే వరం పొందిన హోలిక, ప్రహ్లాదుడిని ఒడిలో కూర్చోబెట్టి అగ్నిలో ప్రవేశించగా, విష్ణుమూర్తి కటాక్షంతో ప్రహ్లాదుడు రక్షించబడి, హోలిక దహనమైంది. దీనికి గుర్తుగా హోలీ పండుగకు ముందు రోజు హోలికా దహనం నిర్వహించే ఆచారం కొనసాగుతోంది.అలాగే రాధా-కృష్ణుల దైవిక ప్రేమకు గుర్తుగా రంగుల పండుగ ఆవిర్భవించిందని విశ్వాసం ఉంది. చిన్ననాటి శ్రీకృష్ణుడు తన నీలి వర్ణం గురించి ఆలోచించగా, తల్లి యశోద సూచనతో రాధ ముఖానికి రంగు పూయడం ద్వారా రంగుల సంబరాలకు శ్రీకారం చుట్టినట్లు పురాణ గాథలు తెలియజేస్తున్నాయి.శీతాకాలం ముగిసి వసంత ఋతువు ఆగమనాన్ని ఆహ్వానిస్తూ, చీకటి నుంచి వెలుగుకు మార్పును సూచిస్తూ హోలీని దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. కొన్ని ప్రాంతాల్లో దీనిని కామ దహనం అని కూడా పిలుస్తారు.ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. పండుగను ఆనందంగా జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు.రసాయన రంగులను ఉపయోగించకుండా సహజ వనరులతో తయారు చేసిన రంగులను వినియోగించాలని అన్నారు. పువ్వులతో తయారు చేసిన రంగులు ఆరోగ్యానికి హానికరం కాదని తెలిపారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని కోరారు. రంగుల స్థానంలో గుడ్లు వంటి అపరిశుభ్ర పదార్థాలను వినియోగించడం మానుకోవాలని, రంగులు చల్లేటప్పుడు కళ్లలోకి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.హోలీ పండుగను కుల, మత భేదాలకు అతీతంగా జరుపుకొని భారతదేశ ఐక్యతను ప్రపంచానికి చాటుదామని పిలుపునిచ్చారు.రంగుల పండుగ మన జీవితాల్లో ఆనందం, స్నేహం, ఐక్యతకు ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

# రాజ్యసభలో మాదిగలకు ప్రాతినిధ్యం కల్పించాలి

◆ **ఎమ్మార్పీఎస్ డిమాండ్**

**వనపర్తి,మార్చి2(తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణలో ఈ నెల మొదటి వారంలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకటిని మాదిగ సమాజానికి కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దమందడి మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ మేరకు తీర్మానం చేశారు.ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు సింగిరెడ్డి మహేష్ మాదిగ అధ్యక్షత వహించారు. ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఖాళీ అవబోతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక సీటు కేటాయించాలని కోరారు.తెలంగాణలో మూడు ఎస్సీ రిజర్వ్ లోకసభ స్థానాలు ఉన్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీ ఒక్కటికీ మాదిగలకు అవకాశం ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మాదిగ సమాజానికి లోకసభలో ప్రాతినిధ్యం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన సింగిల్ కాస్ట్‌గా మాదిగలు ఉన్నప్పటికీ, వారికి తగిన గుర్తింపు ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందని విమర్శించారు.ప్రస్తుతం రాజ్యసభలోనైనా మాదిగలకు అవకాశం కల్పించాలని, లేకపోతే మాదిగ సమాజ ఆవేదనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఇప్పటికే లోకసభలో ఏడుగురు రెడ్డి సామాజికవర్గానికి చెందిన సభ్యులు ఉన్నారని, రాబోయే రాజ్యసభ ఎన్నికల్లోనూ అదే వర్గానికి ప్రాధాన్యం ఇస్తే అది అన్యాయమవుతుందని పేర్కొన్నారు. ఖాళీ అయ్యే రెండు స్థానాల్లో ఒకటిని మాదిగలకు కేటాయిస్తే, రెండో స్థానాన్ని ఎవరికి ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కొమ్ము శ్రీనివాసులు మాదిగ, కొమ్ము సత్యనారాయణ మాదిగ, సింగిరెడ్డి వెంకటస్వామి, హనుమంతు, విష్ణుమూర్తి, చిన్న ఆంజనేయులు మాదిగ, జూరాల రాములు మాదిగ తదితర యువకులు పాల్గొన్నారు.





# 15వ బెటాలియన్‌లో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

**సత్తుపల్లి, మార్చి 2 (తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక మండల పరిధిలోని బి.గంగారం గ్రామం 15వ బెటాలియన్ ప్రాంగణంలో మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బెటాలియన్ కమాండెంట్ ఎ.అంజయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1984లో కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన శ్రీపాదరావు మూడు సార్లు ఎమ్మెల్యేగా ప్రజాసేవ చేసి, అనంతరం శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వహించి ఆ పదవికి గౌరవం తీసుకువచ్చారని తెలిపారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ దళాధిపతులు ఎస్.శ్రీధర్ రాజా, బి. వేణుగోపాలరెడ్డి, పరిపాలన అధికారి అశోక్, ఆర్ఐ పి.ఉదయ్‌కుమార్, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలపై ఇందిరా పార్క్‌లో బీజేపీ ధర్నా

◆ **వెంటనే చెల్లింపులు చేయాలని డిమాండ్ చేసిన ఈటల రాజేందర్**

**హైదరాబాద్, మార్చ్ 02 (తెలంగాణ ముచ్చట్లు)**



హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు, ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని తీవ్ర విమర్శలు చేశారు.

పిఆర్సీ 2020 బకాయిలను వెంటనే చెల్లించాలని, డీఏ బకాయిలను వాయిదాలు కాకుండా ఏక మొత్తంగా చెల్లించాలని, లీవ్ ఎన్కాష్మెంట్‌ను తక్షణమే ఇవ్వాలని, 2024 మార్చి నుంచి రిటైర్డ్ అయిన ఉద్యోగులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జిపిఎఫ్, జిఐఎస్ నిధులను వడ్డీతో సహా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.తెలంగాణ ఉద్యమ సమయంలో జెండాలతో సంబంధం లేకుండా పోరాడిన ప్రజలు, ఈరోజు కూడా రాజకీయాలను పక్కన పెట్టి తమ హక్కుల కోసం వచ్చారని ఆయన పేర్కొన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ధర్నా చేయాల్సి రావడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి మాటలు గొప్పగా ఉన్నప్పటికీ చేతల్లో ఫలితం కనిపించడం లేదని విమర్శించారు.



భూముల విక్రయాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. కూకట్‌పల్లి, బాచుపల్లి ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల విలువైన భూములు కబ్జాదారులకు అప్పగించారని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని, ఎన్నికల హామీల అమలుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తాయో చెప్పాలని సవాలు విసిరారు. రిటైర్డ్ ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులను సంఘటితం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం పాత బకాయిలను చెల్లించడం తన బాధ్యతగా గుర్తించుకోవాలని, లేకపోతే ఉద్యమాలు మరింత తీవ్రమవుతాయని స్పష్టం చేశారు.

# తలారి మధు సురేందర్ నాయుడు జన్మదిన వేడుకలు

**నాచారం, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):**



ఉప్పల్ నియోజకవర్గం నాచారంలోని విశ్వనాథ్ అపార్ట్మెంట్స్‌లో తలారి మధు సురేందర్ నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి పూలమాలలతో సత్కరించి స్నేహపూర్వకంగా అభినందించారు.వీర సావర్కార్ నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్ పాల్గొని మధు సురేందర్ నాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. పెంటారెడ్డి కాలనీ పి.ఆర్.సి యూత్ సభ్యులు ముత్యమాచారి, రామకృష్ణరాజు, నవీన్, సంపత్, లింగయ్య, అజయ్, జీవన్, అరుణ్ గజమాలతో సత్కరించారు.రామంతపూర్ మణికంఠ సేవా ట్రస్ట్ చైర్మన్ బాలరాజు, వైస్ చైర్మన్లు ముత్యమాచారి, ప్రకాష్, విజయ్, శరణమయ్య హాజరై ఆశీస్సులు అందించారు. అలాగే చిరంజీవి అభిమానులు, జనసేన పార్టీ సభ్యులు, కోఆప్టెడ్ కార్పొరేటర్ సర్వేష్, శ్రీనివాస్, సంగమేష్ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భం గా మధు సురేందర్ నాయుడు మాట్లాడుతూ, “నా జన్మదినాన్ని ఇంత ఘనంగా నిర్వహించి నాపై చూపిన ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు. సమాజ సేవలో ముందుండి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తాను” అని తెలిపారు. కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.



## మణిగిల్ల ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి జిల్లా కలెక్టర్‌కు ఆహ్వానం

**పెద్దమందడి,మార్చ్2(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మణిగిల్ల గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ ఉపాధ్యాయ బృందంతో కలిసి వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభిని కలిసి పాఠశాల వార్షికోత్సవానికి ఆహ్వాన పత్రం అందజేశారు. మణిగిల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7వ తేదీన నిర్వహించబడనున్న విద్యార్థుల వార్షికోత్సవ వేడుకలకు హాజరై విద్యార్థులను ఆశీర్వదించాలని కోరారు.అలాగే సంయుక్త జిల్లా కలెక్టర్ కీమ్య నాయక్ ని కూడా మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు .ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను అధికారులకు వివరించారు. వార్షికోత్సవం విజయవంతం కావాలని గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, ఉపాధ్యాయులు జానయ్య, రాములు, సుధాకర చారి, రఫీ. తదితరులు పాల్గొన్నారు.



## నాగారం జడ్‌పీహెచ్‌ఎస్‌లో వనజా రామ్‌రెడ్డికి ఘన వీడ్కోలు

**నాగారం, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నాగారంలో 36 సంవత్సరాలపాటు ఉపాధ్యాయ వృత్తిలో విశిష్ట సేవలందించిన స్కూల్ అసిస్టెంట్ (బయోసైన్స్) వనజా రామ్‌రెడ్డికి సోమవారం ఘన వీడ్కోలు పలికారు. ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన అభినందన సభ హృద్యంగా సాగింది.విద్యార్థుల విద్యా వికాసానికి అంకితభావంతో పనిచేసిన ఆమె వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ తన సేవా కాలమంతా క్రమశిక్షణ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తికి ఆమె చేసిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.కార్యక్రమానికి నాగారం మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రరెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. టిపిఆర్టియు జిల్లా అధ్యక్షుడు టి. శ్రీధర్, టీఎస్ జిల్లా బాధ్యుడు బి. వెంకటేశ్వర్లు, రామేశ్వర్ గౌడ్, ఆనంద్ రెడ్డి, ఉపాధ్యాయుడు జమదగ్ని తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. శ్రీరాములు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సభను ఆకట్టుకున్నాయి. అనంతరం వనజా రామ్‌రెడ్డిని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.




## జాతీయ స్థాయి ఎన్‌ఎంఎంఎస్‌ఈలో రాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థుల ప్రతిభ

**నాగారం, మార్చ్ 02 (తెలంగాణ ముచ్చట్లు)**

జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్‌ఈ) 2025-2026 విద్యా సంవత్సరానికి గాను రాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల నుండి ఎనిమిదవ తరగతి విద్యార్థులు జి. కార్తిక్, ఏ. సమత ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు.ఈ స్కాలర్షిప్ ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం తరపున ప్రతినెలా రూ.1000 చొప్పున నాలుగు సంవత్సరాలపాటు (9వ, 10వ తరగతులు మరియు ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాలు) ఆర్థిక ప్రోత్సాహకం అందించనుంది. పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఈ పథకం తోడ్పడుతుంది.విద్యార్థుల విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం. జమదగ్ని హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, ఎపిపిసి చైర్మన్ విద్యార్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.రాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్‌కు ఈ విజయంతో మంచి గుర్తింపు లభించిందని స్థానికులు పేర్కొన్నారు.





## సంక్షేమ రుణాలకు సిబిల్ స్కోర్ మినహాయింపు కోరిన ఎమ్మెల్యే మర్రి

**మేడ్చల్–మల్కాజ్గిరి, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సంక్షేమ శాఖల ద్వారా అందించే రుణాలకు సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోకుండా, ప్రాసెసింగ్ ఫీజును నామమాత్రంగా ఉంచాలని బ్యాంక్ అధికారులను కోరారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, ఆర్బీఐ డిజిఎం, నాబార్డు జిఎం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు సకాలంలో అందేలా చూడాలని బ్యాంకర్లకు సూచించారు. వ్యవసాయం, పరిశ్రమల రుణాలను నిర్ణీత గడువులోగా మంజూరు చేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రుణాలు తీసుకున్న లబ్ధిదారులు సకాలంలో చెల్లింపులు చేస్తే సిబిల్ స్కోర్ మెరుగుపడి భవిష్యత్తులో మరిన్ని రుణాలు సులభంగా పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.202526 ఆర్థిక సంవత్సరానికి జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో రూ.28,160.71 కోట్ల లక్ష్యానికి గాను రూ.24,900.93 కోట్లు మాత్రమే సాధించామని, మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని బ్యాంకర్లను కోరారు. 202627 సంవత్సరానికి గాను రూ.33,229.71 కోట్ల లక్ష్యంతో జిల్లా వార్షిక రుణ ప్రణాళిక (PLP) పుస్తకాన్ని విడుదల చేశారు. సీడీ నిష్పత్తి 60 శాతం కంటే తక్కువగా ఉండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని బ్యాంకులు సమావేశాలకు హాజరుకాకపోవడాన్ని గమనించి, విషయాన్ని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ ఎల్ బి సి), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్ బి ఐ), లకు నివేదించాలని సూచించారు.అలాగే ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పిఎంజెజెబివై) ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన (పిఎంఎస్బివై) పథకాలలో 60 శాతం కంటే ఎక్కువ నమోదు సాధించాలని బ్యాంకులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పద్మజా, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.



## దండేపల్లి గ్రామంలో అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ

**ఎల్కతుర్తి, మార్చి 2: (తెలంగాణ ముచ్చట్లు)**

ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల భాగంగా 2వ అంగన్వాడీ సెంటర్ భవన నిర్మాణానికి సోమవారం ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శ్రీ గొలిపెల్లి సంపత్ గారు అధ్యక్షత వహించి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రి గారి ఆశీస్సులతో గ్రామ అభివృద్ధి దిశగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి ఏఎంసీ చైర్మన్ సుఖినే సంతాజీ గారు, ఎల్కతుర్తి మండల పార్టీ అధ్యక్షులు అలిగేటి ఇంద్రసేన రెడ్డి గారు, భావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్ గారు, ఉప సర్పంచ్ శనిగరపు సందీప్ గారు, ప్రజా నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వర్ గారు, పంచాయతీ కార్యదర్శి తాళ్లపల్లి అఖిల గారు హాజరయ్యారు.

దండేపల్లి గ్రామ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలోని చిన్నారుల విద్యాభ్యాసం మరియు పోషకాహార సదుపాయాల మెరుగుదలకు ఈ అంగన్వాడీ భవనం ఎంతో దోహదపడుతుందని సర్పంచ్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని హామీ ఇచ్చారు.



## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మారుతి ఎంక్లేవ్ నూతన కమిటీ

**చర్లపల్లి, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ చర్లపల్లి డివిజన్ పరిధిలోని మారుతి ఎంక్లేవ్ నూతన కమిటీ సభ్యులు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిను ఆయన సైనిక్‌పురి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు.మారుతి ఎంక్లేవ్‌లో రోడ్లు, పార్కుల అభివృద్ధి కోసం మొత్తం రూ.2.30 కోట్ల నిధులు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగా రూ.95 లక్షలు ఇప్పటికే మంజూరు చేసినట్లు వెల్లడించారు. మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని, కాలనీ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి, సభ్యులు నరేష్, మనోహర్ బాబు, శివ శంకర్ గౌడ్, నవీన్ యాదవ్, వెంకట్ రెడ్డి, కోటేశ్వరరావు, సంతోష్ రెడ్డి, మాధవరావు, ఉమాకాంత్ రెడ్డి, గోపాల్ రెడ్డి, ఉపేంద్ర, సురేష్, అభిషేక్, సాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహా శాంతి హోమానికి ఏసీపీ నర్సింహరావు, ఇనుగాల రాకేష్ రెడ్డిలకు ఆహ్వానం

**హసన్ పర్తి, మార్చ్ 03(తెలంగాణ ముచ్చట్లు):**





హనుమకొండలో మార్చి 8, 2026 ఆదివారం ఉదయం 9 గంటలకు కాకతీయ కాలనీలోని హోమ ఫలం ఫంక్షన్ హాల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మహా శాంతి హోమ కార్యక్రమానికి హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, ప్రముఖ సామాజిక సేవకుడు ఇనుగాల రాకేష్ రెడ్డిలను నిర్వాహకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. దేశ శాంతి, కుటుంబ క్షేమం, లోక మంగళం లక్ష్యంగా ఈ మహా యజ్ఞాన్ని వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రీ దత్తాత్రేయ స్వామి ఆశీస్సులు, వారాహి అమ్మవారి అనుగ్రహంతో 500 హోమగుండాలతో ఈ మహా శాంతి హోమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అగ్నికుండాల్లో ఆహుతులు సమర్పిస్తూ దేశ శాంతి, ప్రజల సౌఖ్యం, కుటుంబాల అభ్యుదయం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా వారాహి అమ్మవారికి విశేష పూజలు, అలంకరణలు, అర్చనలు నిర్వహించనున్నారు. మేళతాళాలు, నాదస్వరాల నినాదాలతో భక్తి వాతావరణం నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక గురువుల ఆశీర్వచనాలు, ప్రవచనాలు ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అదనంగా "మా భూలోక వారాహి" అనే భక్తి గీతాన్ని ఈ సందర్భంగా విడుదల చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురుపూజలు, జపాలు, హవనాలు నిర్వహించి రుద్రాక్షలు, కుంకుమ, గాజులు వంటి పవిత్ర ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయనున్నారు.

ఈ సందర్భంగా ఇనుగాల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో శాంతి, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి మహా యజ్ఞాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో కుటుంబ విలువలు, సంస్కృతి పరిరక్షణకు ధార్మిక కార్యక్రమాలు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. 500 హోమగుండాలతో నిర్వహించనున్న ఈ మహా శాంతి హోమం ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించడమే కాకుండా, సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. తాను కూడా ఈ మహా కార్యక్రమంలో పాల్గొని దేవి కటాక్షం పొందుతానని తెలిపారు. నిర్వాహకులు చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, భక్తులందరూ కుటుంబ సమేతంగా హాజరై ఈ దివ్య మహోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాశీలోని అవహాన అఖారా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ మహా శాంతి హోమానికి తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధ, విశ్వాసాల సమ్మేళనంగా జరగనున్న ఈ మహా శాంతి హోమం హనుమకొండ ఆధ్యాత్మిక చరిత్రలో ఒక విశిష్ట ఘట్టంగా నిలుస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## హోలీ శుభాకాంక్షలు తెలిపిన డాక్టర్ కాప చంద్రకళ..

- **చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక హోలీ :..**
- **మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ**

**ఖమ్మం బ్యూరో, మార్చి 2(తెలంగాణ ముచ్చట్లు)**

రంగుల పండుగ హోలీ సందర్భంగా మున్సిపాలిటీలోని ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని ఆమె తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రసాయనాలతో తయారైన హానికరరంగులనుఉపయోగించకుండా సహజసిద్ధమైన రంగులతో హోలీ జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. సమాజంలో ఐక్యత, స్నేహభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించే ఉత్సవంగా హోలీ నిలవాలని ఆయనఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకు ప్రతి ఇంటిలో ఆనందం వెల్లివిరియాలని కోరుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేస్తూ, వాటి విలువలను భావి తరాలకు అందించేలా పిల్లల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. హోలీ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సంతోషాలు, సంబరాలు నింపాలని నామ కోరుకున్నారు.



## నారాయణ పాఠశాలలో ఘనంగా స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్

**నాచారం, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గ నాచారం లోని నారాయణ పాఠశాలలో స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 1, 2 తరగతుల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో వివిధ సబ్జెక్టుల్లో నేర్చుకున్న పాఠాలు, వ్యాకరణాంశాలను తమ తల్లిదండ్రుల సమక్షంలో స్వయంగా వివరించారు.



చిన్నారులు ఉపాధ్యాయులు సిద్ధం చేసిన బోధనోపకరణాల సహాయంతో పాఠాలలోని ముఖ్య అంశాలను చక్కగా వివరిస్తూ, తాము ఆ పాఠాల ద్వారా పొందిన జ్ఞానాన్ని స్పష్టంగా తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభ తల్లిదండ్రులను ఆకట్టుకుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వరావు హాజరై మాట్లాడుతూ, చిన్నారులు ధైర్యంగా ముందుకు వచ్చి పాఠాలను వివరించడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల కృషి వల్లే విద్యార్థుల్లో ఇలాంటి నైపుణ్యాలు పెంపొందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ పర్వీన్ మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో ఆత్మవిశ్వాసం, వ్యక్తీకరణ నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఈచాంప్స్ ఆర్‌డీ హెడ్ మహేశ్వరి, కోఆర్డినేటర్ లక్ష్మీ భవాని, ఈచాంప్స్ వి.పి సరిత, ఈకిడ్జ్ వి.పి షాహీన్, పీఈటీ నరేష్, ఏఓ మహేందర్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన రాజారపు సుమన్

**ధర్మసాగర్,మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):**

ఎర్రవల్లిలోని నివాసంలో బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ను ధర్మసాగర్ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజారపు సుమన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, పార్టీ నిర్మాణ బలోపేతం, గ్రామ స్థాయి కార్యకలాపాల పురోగతి వంటి అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరంపై అభిప్రాయాలు వ్యక్తమైనట్లు సమాచారం.ధర్మసాగర్ మండలానికి సంబంధించిన స్థానిక సమస్యలు, ప్రజాభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణపై రాజారపు సుమన్ వివరించినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు.







## ఢిల్లీలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు

**హన్మకొండ,మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):**

ఢిల్లీలో ఢిల్లీ బంజారా స్టూడెంట్స్ యూనియన్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి మాజీ ఎంపీ ప్రొఫెసర్ అజ్మీర సీతారాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్, ఆల్ ఇండియా బంజారా అధ్యక్షుడు రాములు నాయక్ సహా వివిధ సంఘాల ప్రతినిధులు, బంజారా సమాజ నాయకులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా గిరిజన జాతుల ఆరాధ్య దైవంగా నిలిచారని పేర్కొన్నారు. ప్రతి వర్గ పరిస్థితుల్లోనూ సమాజ హితం కోసం కృషి చేసిన మహానీయుడిగా ఆయనను అభివర్ణించారు. సమాజంలో సమానత్వం, న్యాయం, సేవాభావం వంటి విలువలను ప్రతిపాదించిన ఆధ్యాత్మిక నాయకుడిగా సేవాలాల్ మహారాజ్ నిలిచారని తెలిపారు. నేటి యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, బంజారా లిపి, చరిత్రలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సంజీవ్ నాయక్, రాములు నాయక్ మాట్లాడుతూ సమాజ ఐక్యత కోసం సేవాలాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వివిధ కులాల సంఘాల నాయకులు, బంజారా సమాజ ప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## అధికారికంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి

ఖమ్మం బ్యూరో, మార్చి -2 (తెలంగాణ ముచ్చట్లు)

శాసన సభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాద రావు జయంతి వేడుకలను కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకలకు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసన సభ స్పీకర్ గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఘనంగా నిర్వహణ

మేడ్చల్ – మల్కాజ్గిరి మార్చ్ 02 ( తెలంగాణ ముచ్చట్లు):

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా జిల్లా యువజన & క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ లో ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు.జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మాట్లాడుతూ, శాసనసభ సభాపతి పదవికి వన్నె తెచ్చిన మహనీయుడు శ్రీపాదరావు అని అభివర్ణించారు. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో ఆయన విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించడం గౌరవకరమైన విషయమని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్ఓ (ఇన్‌చార్జ్) చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

◆సర్పంచ్ గద్దకుమార్ స్వామి

భీమదేవరపల్లి,మార్చి 02,(తెలంగాణ ముచ్చట్లు)

నేటి బాలలే రేపటి పౌరులని, చిన్నారులను చిన్నప్పటి నుంచే ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిదని గ్రామ సర్పంచ్ గద్దకుమార్ స్వామి తెలిపారు. మండలంలోని కొప్పూరు గ్రామ అంగన్వాడి కేంద్రంలో సోమవారం నమోదైన చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు బాలామృత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ గద్దకుమార్ స్వామి,ఉప సర్పంచ్ మిరియాల రాణి రాజు కలిసి బాలామృతాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారుల పెరుగుదల దశలో సరైన పోషకాహారం అందించడం ఎంతో ముఖ్యమని అన్నారు. బాలామృతం తీసుకోవడం ద్వారా చిన్నారుల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా మూడు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా బాలామృతం అందించాలని తల్లులకు సూచించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రతి నెల హెల్త్ కార్డుల్లో చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేసి వారి ఎదుగుదల, ఎత్తుబరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. పోషకాహార లోపం రాకుండా అంగన్వాడి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా సర్పంచ్,ఉప సర్పంచ్‌లను అంగన్వాడి టీచర్ శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రత్నకుమారి, అంగన్వాడి టీచర్ మణెమ్మ ఆశ కార్యకర్త కొమ్ముల స్వరూప, ఆయా కృష్ణ,టీఎంఆర్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అంబాల చక్రపాణి, గడిపె వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ సంస్థలో భారీగా ఉద్యోగాల కోత

**ప్రపంచ టెక్ రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ వ్యాపారవేత్త జాక్ డోర్సేయ్నే తృత్వంలోని ఆర్థిక సేవల సంస్థ లో భారీగా ఉద్యోగాల కోత ప్రకటించారు. దాదాపు 4,000 మంది సిబ్బందిని తొలగించనున్నట్లు సంస్థ వెల్లడించింది. సంస్థ ప్రస్తుతం లాభాల్లోనే ఉన్నప్పటికీ, పనితీరు సామర్థ్యాన్ని పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు జాక్ డోర్సీ స్పష్టం చేశారు.**




**కృత్రిమ మేధస్సు వినియోగంతో తక్కువ మంది సిబ్బందితోనే అధిక పనితీరును సాధించవచ్చని ఆయన విశ్వసిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో అంతర్గత వ్యవస్థలను మరింత ఆటోమేషన్ వైపు మళ్లించి ఖర్చులను తగ్గించడం, ఉత్పాదకతను పెంచడం ప్రధాన ఉద్దేశ్యంగా భావిస్తున్నారు.**

**ఇక కృత్రిమ మేధస్సు ప్రభావంపై ప్రముఖ రచయిత రాబర్ట్ కియోసాకి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సాంకేతికత వల్ల ధనికులు మరింత లాభపడే అవకాశం ఉందని, సాధారణ ఉద్యోగులు మాత్రం ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంస్థలు ఖర్చులను తగ్గించుకుని లాభాలు పెంచుకుంటాయని, కానీ కార్మిక వర్గం గడ్డుకాలాన్ని ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా చిత్రిని రీసెర్చ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం 2028 నాటికి కృత్రిమ మేధస్సు విస్తృత వినియోగం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది. అనేక రంగాల్లో మానవ శ్రమ అవసరం తగ్గిపోవడం వల్ల ఉపాధి అవకాశాలు తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరించింది.**

**సాంకేతిక విప్లవం వేగంగా ముందుకు సాగుతున్న ఈ సమయంలో, భవిష్యత్తులో ఉపాధి రంగం ఎలా మారుతుందన్నది ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఉద్యోగ భద్రత, సామాజిక సమతుల్యత, ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలు రానున్న సంవత్సరాల్లో కీలకంగా మారనున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.**

# హెల్మెట్ ధరించకపోతే ప్రమాదం తీవ్రం

## కౌన్సిలింగ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

మల్కాజిగిరి, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):






రోడ్డు ప్రమాదాల నివారణకు మరియు ద్విచక్ర వాహనదారుల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు నేరేడ్మెట్ వాయుపురిలో పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజిగిరి సిపి అవినాష్ మొహంతి ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రాఫిక్ అదనపు డీసీపీ లక్ష్మీ తెలిపారు.హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న బైక్ రైడర్లను ఆపి ముందుగా కౌన్సిలింగ్ నిర్వహించారు.రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను ఎలా రక్షిస్తుందో వివరించి వారికి అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల తల గాయాలు తీవ్రమవుతాయని, చిన్న ప్రమాదమే ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.అనంతరం 'హెల్మెట్ బ్యాంక్' ద్వారా హెల్మెట్ లేని వారికి తాత్కాలికంగా ఒక హెల్మెట్‌ను అందజేశారు.సాయంత్రం వరకు ఆ హెల్మెట్‌ను ఉపయోగించి, కొత్త హెల్మెట్ కొనుగోలు చేసిన తర్వాత తీసుకున్న హెల్మెట్‌ను తిరిగి డిపాజిట్ చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా రైడర్లలో బాధ్యతాభావం పెంపొందించడమే ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ట్రాఫిక్ ఏసీపీ, ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని పోలీసులు వెల్లడించారు.

## టిబిజేపి జిల్లా అధ్యక్షుడు సామ్రాట్ గుప్తాను పరామర్శించిన ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ

ఖమ్మం బ్యూరో, మార్చి 2(తెలంగాణ ముచ్చట్లు)

ఖమ్మం జిల్లా బీజేపీ కోశాధికారి కొణతం లక్ష్మీనారాయణ టిబీజేపి జిల్లా అధ్యక్షుడు వందనపు సామ్రాట్ గుప్తాను ఆయన స్వగృహంలో పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.

ప్రమాదం ఎలా జరిగిందో వివరాలు తెలుసుకున్న కొణతం లక్ష్మీ నారాయణ, సామ్రాట్ గుప్తాకు ధైర్యం చెప్పి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రజాసేవలో ఎప్పుడూ చురుకుగా ఉండే జర్నలిస్ట్ నాయకుడుగా మరింత ఉత్సాహంతో తిరిగి కార్యకలాపాల్లో పాల్గొనాలని సూచించారు.

అలాగే సామ్రాట్ గుప్తా కుమారుడు కూడా ప్రమాదానికి గురైన విషయం తెలిసి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. పార్టీ తరపున ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొంటూ, వైద్యుల సూచనల ప్రకారం విశ్రాంతి తీసుకుని పూర్తిస్థాయిలో కోలుకోవాలని కొణతం లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు.



## ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన కాప్రా ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు



కాప్రా, మార్చి 02 (తెలంగాణ ముచ్చట్లు):

ఉప్పల్ నియోజకవర్గ కాప్రా సర్కిల్ లో నూతనంగా ఎన్నికైన కాప్రా ప్రింట్ మీడియా ప్రధాన పత్రికల ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలుపుతూ, పాత్రికేయులు సమాజానికి అద్దం పట్టే బాధ్యతాయుతమైన వృత్తిని నిర్వర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు, స్థానిక ఇబ్బందులను వెలుగులోకి తీసుకువచ్చి పరిష్కార దిశగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే పనిలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషించాలని సూచించారు. పాత్రికేయుల సంక్షేమం, అభ్యున్నతికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. క్లబ్ అధ్యక్షుడు లయన్ వడ్లోజు జ్యోతిర్మయా చారి మాట్లాడుతూ, ప్రజల సమస్యలపై నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తూ జర్నలిజం విలువలను కాపాడేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఆదిమూలం శ్రీనివాస్, కోశాధికారి వట్టిపల్లి సురేష్ తదితరులు కూడా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యక్షులు పలుగుల పవన్, లక్కిడి బాల్ రెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డమీది బాలరాజు గౌడ్, కార్యదర్శి రోజా రాణి, సలహాదారులు మరియు కమిటీ ప్రతినిధులు చంద్రమౌళి, కేసీ మోహన్, క్యాసాని సత్యనారాయణ, కడియాల రమేష్, శ్రీనివాసరావు, ఉల్లోజు శ్రీనివాస్, వేముల శంకర్, సహదేవా చారి, నర్సింగ్ గౌడ్, గుమ్మడి హరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సంగెం మండలంలో పెద్ద తండా సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు సన్మానం

వరంగల్,మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):






వరంగల్ జిల్లా సంగెం మండలంలోని పెద్ద తండా గ్రామ సర్పంచ్ గుగులోత్ వినోద్, ఉపసర్పంచ్ రవీందర్ నాయక్‌లను మండల ఎంఆర్ఓ, తహసీల్దార్ రాజ్ కుమార్ శాలువాతో సన్మానించారు.లోహిత గ్రామ పంచాయతీ నుంచి విడిగా ఏర్పాటు చేసిన పెద్ద తండా గ్రామ పంచాయతీకి ఇప్పటివరకు భౌగోళిక సరిహద్దులు స్పష్టంగా గుర్తించలేదని, వాటిని తక్షణం నిర్ణయించాలని సర్పంచ్, ఉపసర్పంచ్ అధికారులను కోరారు. ఈ అంశంపై తహసీల్దార్‌తో చర్చించారు. సమావేశంలో గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చ జరిగింది. గ్రామాభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని అధికారులు తెలిపారు.ప్రజాప్రతినిధులు మరియు అధికారుల మధ్య సమన్వయం ఉంటే గ్రామం సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు. సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో ముగిసింది.

# నేడే ఎర్రగట్టు వెంకన్న జాతర ప్రారంభం

- కేతు గ్రస్త చంద్రగ్రహణం కారణంగా స్వామి వార్ల కళ్యాణం రద్దు.
- ఎర్రగట్టు వెంకటేశ్వర స్వామి జాతర ఏర్పాట్లు వేగవంతం – ఉత్సవ కమిటీ నియామకం.

హసన్ పర్తి,మార్చ్ 02( తెలంగాణ ముచ్చట్లు):

ప్రతి సంవత్సరం హోలీ పర్వదినం మొదలుకొని ఐదు రోజులపాటు హసన్ పర్తి మండలంలోని ఎర్రగట్టు వెంకన్న జాతర ఘనంగా నిర్వహించబడుతుంది .ఈ సంవత్సరము హోలీ రోజున కేతు గ్రస్త చంద్రగ్రహణం కారణంగా స్వామి వారి కళ్యాణం రద్దు అయినట్లునిర్వాహకులు తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామి అమ్మవార్లు హసన్ పర్తి, భీమారం నుండి బయలుదేరి పెద్ద చక్రముల బండ్లు ఉదయం తిరుగుతాయని అన్నారు.జాతర ఏర్పాట్లను సమన్వయంతో నిర్వహించడానికి ప్రత్యేక ఉత్సవ కమిటీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండేలా కమిటీని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారులతో పాటు వివిధ ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు, స్థానిక ప్రముఖులను కమిటీలో సభ్యులుగా చేర్చారు. ఉత్సవాల నిర్వహణలో మార్క్ రాజు, లోక శ్రీనివాస్, చింతల రమేష్, చాగంటి నరసింహం, సంచాల సుధీర్, గుండె సందీప్, పెదపల్లి శ్రీధర్ తదితరులను సభ్యులుగా నియమించారు. ఈ నెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు జాతర ఉత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయడం, తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, వైద్య శిబిరాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అలాగే




అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన చోట తాత్కాలిక వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జాతర సమయంలో భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం కల్పించేలా క్యూలైన్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. జాతర ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కమిటీ సభ్యులు పరస్పర సహకారంతో పనిచేయాలని, ప్రజల సహకారం కూడా అవసరమని జిల్లా అధికారులు కోరారు. భక్తులు నియమ నిబంధనలు పాటిస్తూ జాతరలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



# రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

**భీమదేవరపల్లి,మార్చి 02(తెలంగాణ ముచ్చట్లు):** మండలంలోని కొత్తకొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఎస్. ఎల్లయ్య మరణించి 11వ రోజు కార్యక్రమం సందర్భంగా రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆయన కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఎల్లయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.
రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి, ప్రస్తుత మున్సిపల్ కౌన్సిలర్ వర్ధిలేని రవీందర్ రావు ఉదారంగా 25 కిలోల బియ్యాన్ని విరాళంగా అందజేశారు. అలాగే రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం తరపున రూ.5,000 నగదు సహాయాన్ని ఎల్లయ్య భార్యకు వారి కుమారుల సమక్షంలో అందించారు.
ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మార్త రవీందర్, కార్యదర్శి పేరాల లక్ష్మణరావు, వైస్ ప్రెసిడెంట్ ఈవీఆర్ నరసయ్య, కోశాధికారి అల్లకొండ బాపురెడ్డి, పబ్లిసిటీ కార్యదర్శులు పోరేటి సమ్మిరెడ్డి, సిహెచ్ ఆగయ్యతో పాటు కమిటీ సభ్యులు మాడుగుల ఈశ్వరయ్య, డి.వై గౌడ్, ఎస్. ప్రభాకర్, పుల్ల స్వామి, టీ. కనకయ్య, సిహెచ్ ఆర్ మౌళి, జి.ఎస్ నందం తదితరులు పాల్గొన్నారు.




# బడ్జెట్‌లో బెస్ట్ టాబ్లెట్లు

**హైదరాబాద్ – 2 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)**
నేటి విద్యా విధానంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఆన్‌లైన్ తరగతులు వినడం నుంచి డిజిటల్ నోట్స్ రాసుకోవడం వరకు విద్యార్థులకు టాబ్లెట్ ఒక నిత్యావసర సాధనంగా మారింది. అయితే అధిక ధరలు వెచ్చించలేని మధ్యతరగతి కుటుంబాలకు సరసమైన ధరలో మంచి ఫీచర్లు కలిగిన పరికరాలు అవసరం. ప్రస్తుతం మార్కెట్లో అలాంటి అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. సుమారు పదమూడు వేల నుంచి పదహారు వేల రూపాయల లోపే విద్యార్థుల అవసరాలను తీర్చగల టాబ్లెట్లు లభిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. వాటిలో రెడ్మీ ప్యాడ్ సరసమైన ధరతో ప్రాథమిక అవసరాలకు అనుకూలంగా ఉంటుంది. పెద్ద తెర, దీర్ఘకాలిక బ్యాటరీ సామర్థ్యం ఈ పరికరానికి ప్రత్యేకత. చదువు, వీడియో క్లాసులు, సాధారణ వినియోగానికి ఇది చక్కగా సరిపోతుంది. అలాగే రియల్మి ప్యాడ్ 2 మెరుగైన డిస్‌ప్లే నాణ్యత, మల్టీటాస్కింగ్ సామర్థ్యంతో ప్రత్యేకంగా నిలుస్తోంది. ఆఫీస్ పనులు, ప్రెజెంటేషన్లు సిద్ధం చేయడం వంటి అవసరాలకు ఇది అనువైన ఎంపికగా భావిస్తున్నారు. ఇదే తరహాలో ఒప్పో ప్యాడ్ ఎస్ ఇ కూడా మంచి పనితీరు, ఆకర్షణీయమైన రూపకల్పనతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది.
కొంచెం మెరుగైన వేగం, బ్రాండ్ విలువ ఆశించే వారు వన్ ప్లస్ ప్యాడ్ లైట్ వైపు మొగ్గు చూపవచ్చు. ఈ పరికరం స్మూత్ పనితీరు, నాణ్యమైన నిర్మాణంతో విద్యార్థులకు మాత్రమే కాకుండా సాధారణ వినియోగదారులకు కూడా సరిపోతుంది. టాబ్లెట్ ఎంపికలో ధరతో పాటు మరి కొన్ని అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రయాణాల్లో ఎక్కువగా ఉపయోగించేవారు సిమ్ కార్డు మద్దతు ఉన్న నమూనాలను ఎంపిక చేసుకోవడం మంచిది. సుదీర్ఘ తరగతుల కోసం మంచి బ్యాటరీ బ్యాకప్ ఉండటం అవసరం. చదువులతో పాటు సినిమాలు చూడడం, ఆటలు ఆడుకోవడం వంటి అవసరాలకు సరిపడే ప్రాసెసర్, మెమరీ సామర్థ్యం ఉండాలి.
మొత్తంగా బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని, అవసరాలకు అనుగుణంగా సరైన టాబ్లెట్‌ను ఎంచుకుంటే అది డిజిటల్ విద్యాభ్యాసంలో విశ్వసనీయ భాగస్వామిగా

# పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త

- **పీఎఫ్ ఖాతాదారులకు శుభవార్త.. వడ్డీ రేటు ఎంతంటే?**

**న్యూఢిల్లీ – 2 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)**
దేశవ్యాప్తంగా సుమారు 7.5 కోట్ల మంది ఉద్యోగులకు కీలక ప్రకటన వెలువడింది. ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఎంప్లాయిస్' ప్రావిడెంట్ ఫండ్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి పీఎఫ్ డిపాజిట్లపై వడ్డీ రేటును 8.25 శాతంగా యథాతథంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని సంస్థ అత్యున్నత విధాన మండలి సెంట్రల్ బోర్డ్ అఫ్ ట్రస్టీస్ఆమోదించింది. గత ఆర్థిక సంవత్సరంలో కూడా 8.25 శాతం వడ్డీ రేటు అమల్లో ఉండగా, ప్రస్తుత నిర్ణయంతో ఉద్యోగుల రాబడిలో ఎలాంటి తగ్గింపు ఉండదని స్పష్టమైంది. 2023-24లో వడ్డీ రేటు 8.15 శాతం నుంచి 8.25 శాతానికి పెరిగింది. ఇక 2021-22లో ఇది 8.10 శాతానికి పడిపోయి నాలుగు దశాబ్దాల కనిష్ఠాన్ని తాకింది. మరోవైపు 2015-16లో 8.80 శాతం వరకు అధిక రాబడి లభించింది. 2019-20, 2020-21 ఆర్థిక సంవత్సరాల్లో వడ్డీ రేటు 8.50 శాతంగా కొనసాగింది.
అయితే తాజా నిర్ణయం ఇంకా తుది దశలోనే ఉంది. ఇప్పుడు ఇది ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం కోసం పంపబడుతుంది. ఆమోదం వచ్చిన తర్వాతే దేశవ్యాప్తంగా పీఎఫ్ ఖాతాదారుల ఖాతాల్లో కొత్త వడ్డీ జమ అవుతుంది. వడ్డీ రేటు నిర్ణయం వెనుక పెట్టుబడి పనితీరు ప్రధాన పాత్ర పోషిస్తుంది. సభ్యుల నిధులను ప్రభుత్వ భద్రత పత్రాలు, బాండ్లు, ఈక్విటీలు వంటి ఆస్తుల్లో పెట్టుబడి పెట్టి వచ్చే ఆదాయాన్ని అంచనా వేసి రేటు నిర్ణయిస్తారు. వడ్డీ పెంపు లేకపోయినా 8.25 శాతం రాబడి ప్రస్తుత పరిస్థితుల్లో పోటీదారమైనదిగా ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా బ్యాంకు స్థిర డిపాజిట్లతో పోలిస్తే పీఎఫ్ దీర్ఘకాలికంగా మెరుగైన పొదుపు మార్గంగా కొనసాగుతోందని వారు విశ్లేషిస్తున్నారు. పదవీ విరమణ ప్రణాళికలో కాంపౌండింగ్ ప్రభావం వల్ల పీఎఫ్ కీలక పాత్ర పోషిస్తుందని ఆర్థిక విశ్లేషకులు సూచిస్తున్నారు.

# విద్యార్థులే టీచర్లు ఐన వేళా !

- **తాటికాయల ప్రభుత్వ ప్రాథమిక(ఎంపిపిఎస్) పాఠశాలలో**
- **ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం**

**ధర్మసాగర్,మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):**




మండలంలోని తాటికాయల ప్రభుత్వ ప్రాథమిక(ఎంపిపిఎస్) పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను స్వీకరించి తరగతి గదుల్లో బోధన నిర్వహించారు. తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పుతూ తమ ప్రతిభను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను అనుభవించడం ద్వారా బోధనా ప్రక్రియపై అవగాహన పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని చెప్పారు .ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు హేమలత పాటు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



# బంగారం దూసుకుపోయింది

**హైదరాబాద్ – 2 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)**



మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు, వాటికి ప్రతిగా ఇరాన్ చర్యలతో అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులవైపు మళ్లడంతో బంగారం ధరలు వరుసగా రికార్డు స్థాయిలను తాకుతున్నాయి. కేవలం రెండు రోజుల్లోనే పసిడి ధరలు ₹11,500కు పైగా ఎగబాకడం మార్కెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.
అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ బంగారం ధర ఔన్సుకు 5,320 డాలర్లకు పైగా కొనసాగుతోంది. ఇటీవల ఇది 5,200 డాలర్ల వద్ద ఉండగా, గత వారాల్లో 4,700 డాలర్ల స్థాయి నుంచి క్రమంగా పెరిగింది. వెండి ధర ఔన్సుకు 92.70 డాలర్లకు పైగా ట్రేడవుతోంది. రూపాయి మారకం విలువ డాలర్‌కు ₹91 వద్ద ఉండటంతో దేశీయ మార్కెట్లో ధరల పెరుగుదల మరింత వేగం అందుకుంది.
అంతర్జాతీయ ధోరణి ప్రభావంతో హైదరాబాద్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా పెరిగాయి.
24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ₹1,73,090 వద్ద కొనసాగుతోంది.
22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు ₹1,58,660 వద్ద ఉంది.
వెండి ధర కిలోకు ₹3,25,000కు చేరింది. రెండు రోజుల్లో సుమారు ₹30,000 పెరుగుదల నమోదైంది.
భౌగోళిక ఉద్రిక్తతలు కొనసాగుతున్నంతకాలం బంగారం వంటి సురక్షిత పెట్టుబడులపై డిమాండ్ పెరిగే అవకాశముందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ధరలు ఇప్పటికే అత్యధిక స్థాయిలో ఉండటంతో కొనుగోలుదారులు జాగ్రత్తగా వ్యవహరించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# భారీగా తగ్గిన టమాటా ధరలు

**అమరావతి – 2 మార్చి – (తెలంగాణ ముచ్చట్లు)**



తెలుగు రాష్ట్రాల్లో టమాటా సాగు చేసిన రైతులకు ప్రస్తుతం గడ్డు పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో సాగుదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వినియోగదారులకు తక్కువ ధరకే టమాటా లభిస్తున్నప్పటికీ, రైతులకు మాత్రం పెట్టిన ఖర్చు కూడా తిరిగి రాకపోవడం బాధాకరంగా మారింది. బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం 50 రూపాయలకు సుమారు 4 కిలోల వరకు టమాటా విక్రయిస్తున్నారు.
ప్రత్యేకంగా అనకాపల్లి జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆదివారం నమోదైన గణాంకాల ప్రకారం 30 కిలోల బరువు ఉన్న ఒక టమాటా బాక్స్ కేవలం 90 రూపాయలకు మాత్రమే అమ్ముడైంది. అంటే కిలోకు సుమారు 3 రూపాయల ధర మాత్రమే పలుకుతోంది. ఈ స్థాయి ధరలతో కోత ఖర్చులు, రవాణా వ్యయం కూడా రాకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
ఈ ఏడాది పంట సాగు ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ, గత 15 రోజులుగా కోతలు ముమ్మరం కావడంతో ఒకేసారి భారీగా సరుకు మార్కెట్‌కు చేరింది. సరఫరా ఎక్కువగా ఉండటం, గిరాకీ తగ్గిపోవడం వల్ల ధరలు క్షీణించాయి. అదనంగా శీతలీకరణ గిడ్డంగుల కొరత రైతులకు ఇబ్బందిగా మారింది. నిల్వ చేసుకునే సౌకర్యం లేకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకోవడం తప్ప మరో మార్గం లేకుండా పోతోంది.
ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరుతున్నారు. సరైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. మార్కెట్ స్థిరపడే వరకు రైతులకు ఆర్థిక సాయం అందించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

# కొత్త ఏసీ కొనాలనుకుంటున్నారా? ఇవి తప్పనిసరిగా పరిశీలించండి

**హైదరాబాద్ – 2 మార్చి (తెలంగాణ ముచ్చట్లు)**



వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎయిర్ కండీషనర్ కొనుగోలు చేసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. అయితే సరైన సమాచారం లేకుండా ఏసీ కొనుగోలు చేస్తే విద్యుత్ బిల్లులు అధికమవడం, గది సరిగా చల్లబడకపోవడం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే నిపుణులు సూచించిన కొన్ని కీలక అంశాలను పరిశీలించడం అవసరం.
మొదటగా గది పరిమాణానికి సరిపోయే టన్నేజ్ ఎంపిక చేయడం చాలా ముఖ్యం. సాధారణంగా 120 నుంచి 150 చదరపు అడుగుల గదికి 1 టన్ను ఏసీ సరిపోతుంది. 150 నుంచి 250 చదరపు అడుగుల గదికి 1.5 టన్నుల ఏసీ అనుకూలం. చిన్న గదికి అధిక టన్నేజ్ తీసుకుంటే విద్యుత్ వృథా అవుతుంది. పెద్ద గదికి తక్కువ టన్నేజ్ తీసుకుంటే కూలింగ్ సరిపోదు.
రెండవది స్టార్ రేటింగ్. 5 స్టార్ లేదా కనీసం 3 స్టార్ రేటింగ్ ఉన్న మోడల్ ఎంపిక చేయడం మంచిది. ఎక్కువ స్టార్ రేటింగ్ ఉన్న ఏసీ తక్కువ విద్యుత్ వినియోగంతో ఎక్కువ సామర్థ్యం అందిస్తుంది. దీర్ఘకాలంలో విద్యుత్ ఖర్చు తగ్గించడంలో ఇది సహాయపడుతుంది.
మూడవ అంశం ఇన్వర్టర్ సాంకేతికత. ఇన్వర్టర్ ఏసీలు అవసరానికి అనుగుణంగా కాంప్రెసర్ వేగాన్ని మార్చుకుంటాయి. దీంతో విద్యుత్ వినియోగం తగ్గి, శబ్దం కూడా తక్కువగా ఉంటుంది. నిరంతర కూలింగ్ అందించడంలో ఇవి సమర్థవంతంగా పనిచేస్తాయి. అదనంగా కాపర్ కండెన్సర్ ఉన్న ఏసీ తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఇది వేడి మార్పిడి వేగంగా చేసి నిర్వహణ ఖర్చును తగ్గిస్తుంది. డస్ట్ ఫిల్టర్, యాంటీ బ్యాక్టీరియల్ ఫిల్టర్ వంటి సదుపాయాలు గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయి. స్మార్ట్ కనెక్టివిటీ, దీర్ఘకాల వారంటీ, సర్వీస్ నెట్‌వర్క్ వంటి అంశాలను కూడా కొనుగోలు ముందు పరిశీలించడం అవసరం.
ఇన్‌స్టాలేషన్ ఛార్జీలు, అదనపు ఖర్చులు, బ్రాండ్ విశ్వసనీయత వంటి విషయాలను తెలుసుకుని నిర్ణయం తీసుకుంటే ఏసీ కొనుగోలు ఒక మంచి పెట్టుబడిగా మారుతుంది. సరైన ఎంపికతో వేసవిలో చల్లదనం, దీర్ఘకాలంలో ఖర్చు ఆదా రెండూ సాధ్యమవుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

# భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై – 2 మార్చి ( తెలంగాణ ముచ్చట్లు)**



పశ్చిమ ఆసియాలో ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం భారతీయ షేర్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపింది. భౌగోళిక ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపర్లు భయాందోళనకు గురై తమ షేర్లను విక్రయించడంతో సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ప్రధాన సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరత కారణంగా ఇన్వెస్టర్ల సంపద ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల మేర తగ్గిపోయినట్లు అంచనా.
ముంబై స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ బిఎస్ ఇ సెన్సెక్స్ ఏకంగా 1,048 పాయింట్లు పడిపోయి 80,238 వద్ద ముగిసింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 50 312 పాయింట్లు కోల్పోయి 24,865 వద్ద స్థిరపడింది. యుద్ధ పరిస్థితులు ముదిరితే ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన మార్కెట్ భావజాలాన్ని దెబ్బతీసింది. బ్యాంకింగ్, ఐటి, లోహాలు, ఆటో రంగాలకు చెందిన షేర్లు ఎక్కువగా నష్టపోయాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## మనిషికి మార్కెట్ ధర...

మగాడి విలువను
జీతపు కవర్లలో కొలిచే లోకం,
ఆడదాని అస్తిత్వాన్ని
ప్రసవపు గదుల్లో బంధించే కాలం.

ఎలా ఉన్నావ్ అన్న మాటకన్నా
ముందు
నీ జీతం ఎంత అని అడిగే సంస్కృతి,
అంటే
నిన్ను మనిషిగా కాదు,
మార్కెట్ లోని సరుకులా చూసే దృష్టి.

గుండెకి ధర లేదు,
కలలకి కిలోలు లేవు,
ప్రేమకి బరువు తూకం లేదు,
కానీ మనిషికి మాత్రం
రేటు ట్యాగ్ అంటిస్తున్నారు.

శ్రమను సంఖ్యగా మార్చి,
శరీరాన్ని వస్తువుగా చేసి,
ఆత్మను కూడా అమ్మేంత
చౌకబారిన సమాజం ఇది.

మగాడికి సంపాదన తప్ప
మనసు అవసరం లేదట,
ఆడదానికి ప్రసవం తప్ప
ఆలోచన హక్కు లేదట.

పెళ్లి అంటే ప్రేమ కాదు,
లెక్కల పుస్తకం,
కట్నం అంటే కన్నీళ్ల మీద
వేసిన వడ్డీ శాతం.

ఆడదాని శరీరం మీద
సాంప్రదాయపు ముద్రలు,
మగాడి భుజాల మీద
అప్పుల బరువులు.


ఇద్దరికీ
స్వేచ్ఛ లేదు,
ఇద్దరికీ
మనసు మాట వినే హక్కు లేదు.

ఈ నగరాలు
మనుషుల్ని తయారుచేయవు,
కేవలం
ధరలు పెంచే యంత్రాల్ని తయారుచే
స్తాయి.

ఒక్కో మనిషి
ఒక్కో ఉత్పత్తిగా మారి,
తన విలువ తానే మర్చిపోయే
వికారపు వ్యవస్థ ఇది.



~ బసడ సంపత్ యాదవ్



# శిధిల భవనంలో బాలికల బస..!

**భయానక వాతావరణంలో చదువులు**

**భయానక వాతావరణంలో చదువులు**

**తక్షణ చర్యలకు స్థానికుల డిమాండ్**

**భీమదేవరపల్లి, మార్చి 02, (తెలంగాణ ముచ్చట్లు):**
మండలంలోని ముల్కనూర్ బాలికల వసతి గృహం శిధిలావస్థకు చేరుకోవడంతో అక్కడ నివసిస్తున్న విద్యార్థినుల భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. చదువుకోడానికి ఆశ్రయం కల్పించాల్సిన హాస్టల్ ఇప్పుడు ప్రమాద సూచికగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడైనా గోడలు కూలిపోతాయో, పైకప్పు పెచ్చులు ఊడిపడతాయో అన్న భయంతో విద్యార్థినులు రాత్రులు గడుపుతున్నట్లు సమాచారం.

**గోడల పగుళ్లు, పైకప్పు బీటలు.. ప్రమాదకరంగా భవనం**

వసతి గృహ భవనం పలు చోట్ల తీవ్రంగా దెబ్బతిన్నట్లు కనిపిస్తోంది. గోడలు చిట్లిపోవడం, స్లాబ్‌లకు పగుళ్లు ఏర్పడటం, పైకప్పు సిమెంట్ పొరలు ఊడిపడటం, ఇనుపరాడ్లు బయటపడటం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. గదుల్లో తడి, మూలల్లో బీటలు, సిమెంట్ పెచ్చులు ఊడిపడటం నిత్యకృత్యంగా మారాయి. ఈ పరిస్థితుల్లోనే బాలికలు నిద్రపోవాల్సి వస్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.
రాత్రివేళల్లో గోడల చప్పుళ్లు వినిపించడం, పైకప్పు కదలికలు అనుభవించడంతో కొందరు విద్యార్థినులు గదుల్లో కాకుండా వరండాల్లో గుంపులుగా నిద్రిస్తున్నారనే సమాచారం కూడా వెలుగులోకి వచ్చింది.

**అధ్వాన్నంగా బాత్రూమ్‌ల దుస్థితి,ఆరోగ్య సమస్యల భయం**

హాస్టల్‌లోని బాత్రూమ్ గోడలు పగుళ్లతో నిండిపోయాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, శుభ్రత లోపించడం, నీటి సమస్యలు వంటి అంశాలు విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పరిశుభ్రత లోపం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక హాస్టల్ ప్రాంగణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ కూడా బలహీన స్థితిలో ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అది ఎప్పుడు కూలిపోతుందో అన్న భయం నెలకొంది. ప్రమాదం సంభవిస్తే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

**హాస్టల్ ప్రాంగణంలోనే ప్రాథమిక పాఠశాల తరగతులు**

పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా ఇదే ప్రాంగణంలో తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రమాదకర స్థితిలో ఉన్న భవనం సమీపంలో చిన్నారులు చదువుకోవాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ఇది మరింత ఆందోళన కలిగిస్తోంది.

**నిర్వహణలో నిర్లక్ష్యంపై ఆరోపణలు**

వసతి గృహ నిర్వహణపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గతంలో పలుమార్లు వార్డెన్లు మారినా పరిస్థితిలో మార్పు రాలేదని స్థానికులు అంటున్నారు. పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపిస్తున్నారు. చిన్నారుల భద్రత విషయంలో అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎండాకాలంలోనే కొత్త భవన నిర్మాణం చేపట్టాలి**

వేసవి కాలం కొనసాగుతున్న నేపథ్యంలో వర్షాకాలం రాకముందే పాత భవనాన్ని ఖాళీ చేసి ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని, అదే సమయంలో కొత్త భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఆలస్యం జరిగితే ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు.

**కొత్త కలెక్టర్ జోక్యం అవసరం**

ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కొత్త జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి భవన పరిస్థితిపై పరిశీలన చేపట్టాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రమాదం జరిగాక స్పందించడం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
చిన్నారుల ప్రాణాలకు మించినది ఏదీ లేదని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. చదువుల కోసం వచ్చిన బాలికలు భయంతో గడపకుండా సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొంటున్నారు. అధికారులు తక్షణమే స్పందించి కొత్త భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టి విద్యార్థినుల భయాలను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# హోలీ పండుగ సందర్భంగా మద్యం దుకాణాలు బంద్

**–పోలీస్ కమిషనర్ సునీల్ దాత్**

**ఖమ్మం బ్యూరో, మార్చి 2(తెలంగాణ ముచ్చట్లు)**



హోలీ పండుగ (2026 మార్చి 3) సందర్భంగా ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మద్యం దుకాణాలు (వైన్ షాపులు)బార్లను, కల్లు దుకాణాలు మూసివేయాలని కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆంక్షలు ఉదయం 6 గంటల నుండి మర్చి 4 ఉదయం 6 గంటల వరకు వర్తిస్తాయని తెలిపారు.
అవాంఛనీయ ఘటనలు బహిరంగ ప్రదేశాల్లో గొడవలు జరగకుండా నిరోధించడానికి ఈ చర్య తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. హోలీని ప్రశాంతంగా ఇతరులకు ఇబ్బంది కలగకుండా జరుపుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.





# కెసిఆర్‌ను కలిసిన డాక్టర్ తాటికొండ రాజయ్య

**స్టేషన్ ఘనపూర్, మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):**
తన పుట్టినరోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించిన, స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సోమవారం ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్‌లో బిఆర్ఎస్ పార్టీ అధినేత,మాజీ సిఎం కే. చంద్రశేఖర్ రావును కలసి ఆశీర్వాదం పొందారు.ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన చంద్రశేఖర్ రావు, రాజయ్య గతంలో పార్టీకి అందించిన సేవలను ప్రస్తావించినట్లు సమాచారం. నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకున్న చర్యలను గుర్తుచేసుకుంటూ, భవిష్యత్‌లోనూ అదే ఉత్సాహంతో ముందుకు సాగాలని సూచించినట్లు తెలిసింది.
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై ఈ సందర్భంగా విస్తృతంగా చర్చ జరిగినట్లు వర్గాలు వెల్లడించాయి. ఉప ఎన్నికలు జరిగే




అవకాశాల నేపథ్యంలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవడం, బూత్ స్థాయి వరకు వ్యవస్థను బలోపేతం చేయడం, కార్యకర్తలతో నిరంతర సంప్రదింపులు కొనసాగించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుంటూ క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.
నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల అమలు స్థితిగతులపై కూడా చర్చ జరిగినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా కార్యక్రమాలు చేపట్టాలని, పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపే విధంగా పర్యటనలు నిర్వహించాలని సూచించినట్లు సమాచారం.
రాజయ్య తన రాజకీయ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను ప్రస్తావిస్తూ, పార్టీ పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటించినట్లు తెలిసింది. పార్టీ నాయకత్వం ఇచ్చిన మార్గదర్శకాలను అనుసరిస్తూ నియోజకవర్గ ప్రజలతో మరింత సన్నిహితంగా పనిచేస్తానని తెలిపారు అని వర్గాలు వెల్లడించాయి .ఈ భేటీతో స్టేషన్ ఘనపూర్ రాజకీయాల్లో మళ్లీ చర్చలు జోరందుకున్నాయి. ఉప ఎన్నికలపై స్పష్టత రాకముందే రాజకీయ సమీకరణాలు కదలికలోకి వచ్చినట్లు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీ శ్రేణులు మాత్రం భవిష్యత్ ఎన్నికలకు సిద్ధంగా ఉండేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలనే సంకల్పంతో ఉన్నట్లు తెలుస్తోంది.

# వెల్టూర్ ఎస్సీ కాలనీలో సర్కస్ సందడి- అక్కున చేర్చుకున్న కాలనీ వాసులు

**పెద్దమందడి,మార్చి2(తెలంగాణ ముచ్చట్లు):**
వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ న్యూ ఎస్సీ కాలనీలో తొలిసారిగా నిర్వహించిన సర్కస్ ప్రదర్శనలు స్థానికులను విశేషంగా అలరించాయి.కాలనీలో ఇదే మొదటిసారి సర్కస్ కార్యక్రమం జరగడంతో ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విశేష స్పందన చూపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆసక్తిగా వీక్షిస్తూ కళాకారుల ప్రతిభకు మంత్రముగ్ధులయ్యారు.తాడుపై నడక, దూకుడు,జిమ్నాస్టిక్ విన్యాసాలు ప్రేక్షకుల నుంచి ఘనమైన చప్పట్లను అందుకున్నాయి.ఈ సర్కస్ బృందంలో మహిళలు, పురుషులు, చిన్నారులు అన్న తేడా లేకుండా కుటుంబ సభ్యులంతా కలిసి జీవనోపాధి కోసం శ్రమిస్తున్నారు. చిన్న పిల్లలు సైతం తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకోగా, మహిళలు ధైర్యవంతమైన విన్యాసాలతో కుటుంబానికి ఆర్థికంగా తోడ్పడుతున్నారు.పురుషులు కఠినమైన విన్యాసాలతో పాటు ఏర్పాట్ల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.పొట్టకూటి కోసం గ్రామాల నుంచి గ్రామాలకు తిరుగుతూ ప్రదర్శనలు



ఇస్తున్న వారి జీవన యత్నం పలువురిని కదిలించింది.ప్రదర్శనల అనంతరం కాలనీవాసులు మానవత్వాన్ని చాటుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ సర్కస్ బృందానికి తోచిన ఆర్థిక సహాయం అందజేశారు.అదేవిధంగా బియ్యం, వస్త్రాలు వంటి నిత్యావసర సరుకులు ఇచ్చి వారికి అండగా నిలిచారు.వారి పరిస్థితిని అర్థం చేసుకుని సహాయహస్తం చాపిన కాలనీవాసుల ఉదారత అందరినీ ఆకట్టుకుంది.కాలనీ పెద్దలు మాట్లాడుతూ.. ఇలాంటి సందర్భాల్లో పరస్పర సహకారం సమాజ బలాన్ని పెంపొందిస్తుందని తెలిపారు.సర్కస్ బృందం సభ్యులు కాలనీవాసుల ఆతిథ్యం, సహాయానికి కృతజ్ఞతలు తెలుపుతూ మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతామని చెప్పారు. ఈ ఘటన వెల్టూర్ ఎస్సీ కాలనీలో ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.



# ఘనంగా డాక్టర్ రాజయ్య జన్మదిన వేడుకలు

**స్టేషన్ ఘనపూర్, మార్చి02(తెలంగాణ ముచ్చట్లు):**
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలోని భారత్ రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డా. తాటికొండ రాజయ్య జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల



గణేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.
ఈ సందర్భంగా డా. రాజయ్య పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేయగా, కార్యకర్తలు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయం పరిసర ప్రాంతం నినాదాలతో మార్మోగింది. అభిమానులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.
అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో నాయకులను తీర్చిదిద్దే నాయకుడిగా డా. రాజయ్య ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. కార్యకర్త స్థాయి నుంచి ప్రజాప్రతినిధుల వరకు ఎదగడానికి ఆయన ప్రోత్సాహం, మార్గదర్శనం కీలకమని తెలిపారు. రాజకీయంగా త్యాగం చేసిన నేతగా డా. రాజయ్యను అభివర్ణిస్తూ, ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజాసేవకు అంకితభావంతో పనిచేయాలని పార్టీ శ్రేణులు సంకల్పించాయి. ఈ సందర్భంగా డా. రాజయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సామాజిక మాధ్యమ కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in